PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 105 | విజయవాడ, ఆదివారం 16 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 16 November 2025 | Rs

అమెరికాలో ప్రాపకానికి

ఆర్‌ఎస్‌ఎస్ లాబీయింగ్

- 'ఫాసిస్టు' ముద్రను చెరిపేసుకునేందుకు తంటాలు

7



స్పిన్‌కు విలవిల

భారత్ తొలి ఇన్నింగ్స్ 189/10

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 93/7

8

రెండు రోజుల్లో.. రూ.13 లక్షల కోట్లు

సిఐఐ సదస్సు ముగింపు ఉపన్యాసంలో పెట్టుబడులపై సిఎం ప్రకటన

- వచ్చే ఏడాది నవంబర్‌లో మళ్లీ నిర్వహిస్తాం...
- మరిన్ని ప్రతిపాదనలతో రావాలని పిలుపు



సదస్సులో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు, హాజరైన వివిధ వాణిజ్య సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రెండు రోజుల్లో రాష్ట్రానికి 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విశాఖపట్నంలోని ఎయు ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో శనివారం సాయంత్రం జరిగిన సిఐఐ ముగింపు సదస్సులో ప్రతినిధులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగిన రెండు రోజుల సిఐఐ భాగస్వామ్య సదస్సు చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. 'ఇక్కడ జరిగినవి ఒప్పందాలు మాత్రమే కాదు.. సాంకేతిక ఆలోచనల మార్పిడి. దావోస్ తరహాలో ఈ సెషన్లు నిర్వహించాం.' అని చెప్పారు. 'విశాఖతో రాష్ట్రంలో ఏ నగరానికీ పోలిక లేదు' అని అన్నారు. వచ్చే ఏడాది నవంబర్‌లో మరలా సిఐఐ సదస్సు ఇక్కడే నిర్వహిస్తామని చెప్పారు. ఆ సదస్సుకు మరిన్ని పెట్టుబడులతో రావాలని కోరారు రాష్ట్రంలో మరింతగా కార్మిక సంస్కరణలు చేపడతామని, భూములు, మౌలిక వసతుల రంగంలోనూ సంస్కరణలు తెస్తామని అన్నారు. పెట్టుబడులతోనే పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కలుగుతాయని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని రీతిలో ఎస్క్రో ఖాతాను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం దీనికి గ్యారంటీ ఇస్తోందన్నారు. రెండు రోజుల పాటు జరిగి ఈ భాగస్వామ్య సదస్సుకు మూడు వేల మంది ప్రతినిధులు హాజరు కాగా, దీంట్లో 650 మంది విదేశీయులు ఉన్నారని చంద్రబాబు చెప్పారు. 700 మంది బి టు బి మీటింగుల్లో పాల్గొన్నారన్నారు. వివిధ దేశాల నుంచి 30 మంది మంత్రులు ఈ భాగస్వామ్య సదస్సుకు విచ్చేశారని, రెండు రోజుల పాటు 67 సెషన్లు జరిగాయన్నారు.



సిఐఐ సమ్మిట్‌కు హాజరైన వివిధ వాణిజ్య సంస్థల ప్రతినిధులు

పారిశ్రామిక వేత్తలు పోటీపడుతున్నారు...

అంతకుముందు జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు పోటీపడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉండటమే దీనికి కారణమన్నారు. తన హయాంలో ఏడుసార్లు సిఐఐ సదస్సులు పెట్టానని, ఈ సదస్సు మాత్రం చారిత్రాత్మకంగా నిలిచిపోనుందని చెప్పారు. అయితే, ఎంఒయులు చేసినంత మాత్రాన ప్రాజెక్టులు రావని, పెట్టుబడుల ఆకర్షణ అనేది నిరంతర ప్రక్రియ అని అన్నారు. రెండు రోజుల్లో రూ.13,25,716 కోట్ల పెట్టుబడుల మేర ఎంఒయులు వచ్చాయని, 24 లక్షలకుపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని వివరించారు. రాష్ట్రంలో 2019-2024 అత్యంత విషాదకరమైన కాలమన్నారు. పరిశ్రమలను గత ప్రభుత్వం ధ్వంసం చేసిందని విమర్శించారు. ఇతర రాష్ట్రాల మాదిరే ఆంధ్రప్రదేశ్‌కూ కేంద్రం సహకరిస్తోందన్నారు. కడపలో స్టీల్‌ప్లాంట్ వస్తుందని, విశాఖకు లులూ, గూగుల్, అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్‌లు వస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి టిజి.భరత్, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, గుమ్మడి సంధ్యారాణి, దుర్గేష్, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


విశాఖ ఉక్కుపై చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు

విలేకర్ల సమావేశంలో 'విశాఖ ఉక్కులో అనిశ్చితి నెలకొందని, దీన్ని మీ ప్రభుత్వం ఎలా చూస్తోంది' అంటూ అడిగిన ప్రశ్నకు చంద్రబాబు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పటికే రూ.12 వేల కోట్లు ఇచ్చాం. ప్రతిసారీ కేంద్రం డబ్బులు ఇవ్వాలంటే కుదరదు. అన్ని స్టీల్‌ప్లాంట్‌లకూ లాభాలొస్తుంటే ఇక్కడ ఎందుకు రావడం లేదు' అంటూ అసహనం ప్రదర్శించారు. పబ్లిక్ సెక్టార్‌లో ఉందని బెదిరిస్తామంటే కుదరదని, నష్టాల్లో నడవడానికి వీల్లేదని అన్నారు. 'ప్రైవేటీకరణ చెయ్యనని నేను చెప్పాలా? ప్యాకేజీ ఇచ్చాం కదా!' అని అన్నారు.

శ్రీనగర్ పోలీస్ స్టేషన్‌లో భారీ పేలుడు

- 9 మంది పోలీసు, ఫోరెన్సిక్ అధికారులు మృతి
- మరో 32 మందికి గాయాలు
- ప్రమాదంగా పేర్కొన్న కేంద్ర హోంశాఖ
- తామే పేల్చేశామని జైషే అనుబంధ పిఎఎఫ్ఎఫ్ ప్రకటన

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ మరోమారు ఉలిక్కిపడింది. శ్రీనగర్‌లోని నౌగామ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రాత్రి భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో 9 మంది చనిపోయారు. మరో 32 మంది గాయపడ్డారు. బాధితుల్లో అత్యధిక మంది పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. స్థానికలు, అధికారుల సమాచారం ప్రకారం.. శుక్రవారం రాత్రి 11.22 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ భయానక ఘటన పరిసర ప్రాంతాల్లో భూకంపం తరహాలో ప్రకంపనలు సృష్టించింది. ఒక్కసారిగా భూమి కంపించినట్టుగా భారీ శబ్దం వినిపించింది. వెంటనే మంటలు ఆకాశాన్నంటాయి. పోలీస్ స్టేషన్ ప్రాంగణం అంతా దట్టమైన నల్లపొగ కమ్మేసింది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. పేలుడు తీవ్రతకు సుమారు 300 మీటర్ల దూరంలో శరీర భాగాలు కనిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్టేషన్‌లో పార్కింగ్‌లో ఉన్న పలు వాహనాలు దగ్ధమయ్యాయి. చుట్టుపక్కల భవనాలకూ పగుళ్లు వచ్చాయి. ఇళ్లల్లోని పలువురు సాధారణ పౌరులు కూడా గాయపడ్డారు. అయితే ఈ ఘటన ఉగ్రవాద చర్య కాదని, ప్రమాదవశాత్తూ జరిగిందని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. అంతకుముందు జమ్ముకాశ్మీర్ డిజిపి నళిన్ ప్రభాత్ ఇదే ప్రకటన చేశారు. అయితే శ్రీనగర్‌లో పోలీసు స్టేషన్‌లో పేలుళ్ల తమ పనేనని ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ ప్రకటించింది. దీంతో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



అగ్ని కీలల్లో నౌగామ్ పోలీసు స్టేషన్

సహాయక చర్యలకు ఆటంకం

భారీ పేలుడుతో పోలీస్‌స్టేషన్ భవనం పెద్దఎత్తున ధ్వంసమైంది. వరుసగా చిన్న చిన్న పేలుళు కొనసాగడంతో రెస్క్యూ ఆపరేషన్‌లు ప్రారంభంలో ఆపాల్సి వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తూ చుట్టుపక్కల మరిన్ని పేలుడు పదార్థాలు ఉన్నాయేమో అన్న అనుమానంతో బాంబ్ డిస్పోజల్ టీమ్‌లను సైతం అప్రమత్తంగా ఉపయోగించారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున వరకు ఎన్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, ప్రత్యేక దళాల సమన్వయంతో శిథిలాలను తొలగిస్తూ చిక్కుకుపోయిన వారిని బయటకు తీశారు.

గుర్తు పట్టలేని విధంగా మృతదేహాలు

ఈ పేలుడు ధాటికి మరణించినవారి శరీర భాగాలు చెల్లాచెదురుగా దూరంగా ఎగిసిపడ్డాయి. ఈ ప్రాంతం మతదేహాలను స్వాధీనం చేసుకున్నప్పటికీ, వాటిని గుర్తించడం కష్టతరంగా మారింది. తీవ్రంగా కాలిన అవశేషాలను శ్రీనగర్ పోలీస్ కంట్రోల్ రూమ్కు తరలించి పోస్ట్‌మార్టం, ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. అనంతరం చనిపోయిన వారిలో రాష్ట్ర దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) అధికారి ఒకరు, ఎఫ్‌ఎస్‌ఎల్ బృందంలోని మిగతా 7లో

మరో అల్పపీడనం

- 17,18 తేదీల్లో వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక తీరప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. రాగల 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కిలోమీటర్ల వేగంగా ఈదురుగాలులు వీస్తాయన్నారు. సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని ఆయన సూచించారు. ఈనెల 17న నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు, ప్రకాశం, కడప జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 18న నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రకాశం, శ్రీసత్యసాయి, కడప అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నెల 21న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు.



బిర్సాముండా నివాళి కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

బిర్సా ముండా స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల కోసం పోరాటం

- ప్రభుత్వాల అండతో ఏజెన్సీలో కార్పొరేట్ నిలువు దోపిడీ
- జయంతి కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో ఆదివాసీ ప్రాంతాల్లో సహజ వనరులను కార్పొరేట్లు పెద్దఎత్తున దోపిడీ చేస్తున్నారని, ఆదివాసీ సమరయోధుడు బిర్సాముండా స్ఫూర్తితో దీనికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు అన్నారు. ఆదివాసీ సమరయోధుడు బిర్సాముండా 150వ జయంతి కార్యక్రమం శనివారం ఉదయం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. బిర్సాముండా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జార్ఖండ్‌లో స్వాతంత్ర్యానికి పూర్వం భూస్వాములు పేదలపై, ముఖ్యంగా గిరిజనులు, ఆదివాసీలపై మారణకాండ సృష్టించారని, సహజ వనరులను దోపిడీ చేశారని అన్నారు. మరోవైపు బ్రిటీష్‌వారు అటవీ భూములను లాగేసుకోవడంతో పాటు, ఉత్పత్తులపై పన్ను విధించారని, దీంతో 25 ఏళ్ల వయసులో బిర్సా ముండా వారికి మిగతా 7లో

సమస్యల పరిష్కారానికి సమైక్య పోరు

- బహిరంగ సభలో వక్తల పిలుపు
- ఒంగోలులో ఉత్సాహంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభ ప్రారంభం



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

సమస్యల పరిష్కారం కోసం సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) 15వ రాష్ట్ర మహాసభ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రసంగించిన వక్తలు పిలుపునిచ్చారు. ఒంగోలులోని కొత్త మార్కెట్ వద్ద షాదీఖానాలో మహాసభ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా కొత్త మార్కెట్ సెంటర్ వద్ద జరిగిన బహిరంగ సభకు ముఖ్య అతిధిగా హాజరైన బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా కార్మికుల, ప్రజల జీవితాల్లో మార్పు రావడం లేదన్నారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి పొందాలని, కనీస వేతనం అమలు చేయాలని, తమ సేవలు ప్రభుత్వం గుర్తించి రెగ్యులర్ చేయాలని మున్సిపల్ కార్మికులు కోరుకున్నారని, వీటి అమలుకు ప్రభుత్వాలకు చేతులు రావడం లేదని వివరించారు. టిడిపి కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా పనిగంటల మార్పు బిల్లుతోపాటు, రాత్రి వేళల్లో మహిళలు పని చేసే బిల్లును ఆమోదించిందని చెప్పారు. రాత్రిపూట మహిళలు పని చేసే విషయంలో స్త్రీ, పురుషులు సమానమని మంత్రి వక్రభాష్యం చెప్పారని, అయితే, శాసన సభ సీట్లలో 50 శాతం సీట్లను మహిళలకు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. ప్రధాని మోడీ అమలు చేస్తోన్న ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు టిడిపి, జనసేన, వైసిపి పోటీపడి మద్దతు తెలుపుతున్నాయన్నారు. కార్మిక చట్టాల స్థానే తీసుకొచ్చిన లేబర్ కోడ్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు అంశాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్క్ కాంట్రాక్టు విధానం పేరుతో ఉన్న ఉద్యోగులను తొలగించి పీస్‌రేట్ పద్ధతిలో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నాయన్నారు. సంపదను కార్పొరేట్లకు, బడా కంపెనీలకు దోచిపెట్టడానికి చట్టాలను మారుస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మిగతా 7లో

భారత బొమ్మలకూ ఆర్డర్లు తగ్గాయ్

- అమెరికా సుంకాల దెబ్బ
- ఎగుమతిదారులపై తీవ్ర ప్రభావం

3

'ఉక్కు' కార్మికుల వేతనంపై మెలిక

- సర్క్యులర్ జారీ చేసిన యాజమాన్యం
- భగ్గుమన్న కార్మికులు, కార్మిక సంఘాలు

2

రోడ్డు ప్రమాదంలో వెయిట్ లిఫ్టర్ మృతి



ప్రజాశక్తి-విజయనగరం కంటోన్మెంట్

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న వెయిట్ లిఫ్టర్‌ను లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటన విజయనగరం జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన తాడుతూరి భాస్కరరావుకు ఇద్దరు కుమారులు సత్యజ్యోతి (26), సరోజా గాయత్రి ఉన్నారు. ఇద్దరూ వెయిట్ లిఫ్టింగ్‌లో అనేక పతకాలు సాధించారు. సత్యజ్యోతి ప్రస్తుతం విశాఖపట్నంలోని వాల్తేరు రైల్వే డివిజన్ కార్యాలయంలో క్లర్కుగా పనిచేస్తున్నారు. కొండవెలగాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు సత్యజ్యోతి.. తన సోదరి సరోజా గాయత్రితో కలిసి స్కూటీపై కొండవెలగాడ వెళ్తుండగా విజయనగరం సమీపంలోని వైఎస్‌ఆర్ నగర్ దాటాక ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో సత్యజ్యోతి అక్కడికక్కడే మృతి చెందారు. గాయత్రికి స్వల్ప గాయాలయ్యాయి. టూటౌన్ సిఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. సత్యజ్యోతి మృతికి శాప్ చైర్మన్ రవినాయుడు, విజయనగరం జిల్లా కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సంతాపం తెలిపారు.

సతీష్‌కుమార్ మృతిపై విచారణ వేగవంతం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిఐడి అదనపు డిజిపి రవిశంకర్ అయ్యన్నార్
- కోమలి రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు సీన్ రీ కన్‌స్ట్రక్షన్



కోమలి రైల్వే స్టేషన్ సమీపంలో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ పోలీసులు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

టిటిడి మాజీ ఎవిఎస్‌ఒ, గుంతకల్లు రైల్వే సిఐ సతీష్‌కుమార్ మృతిపై పోలీసు విచారణ ముమ్మరమైంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదైన నేపథ్యంలో మరణానికి కారణం ఆత్మహత్యా? లేక హత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. టిటిడి పరకామణి కేసులో కీలక సాక్షిగా, నిందితుడిగా ఉన్న సతీష్‌కుమార్ ఆ కేసు విచారణ నిమిత్తం తిరుపతి వెళుతుండగా మధ్యలో అనుమానాస్పద స్థితిలో శుక్రవారం రాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇది ముమ్మాటికీ హత్యేనని ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆ దిశగానూ పోలీసులు విచారణ చేస్తున్నారు. సిఐడి అదనపు డిజి రవిశంకర్ అయ్యన్నార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతపురంలోని పోలీసు అతిథి గృహంలో అనంతపురం రేంజ్ డిఐజి షిమోసి, ఎస్‌పి జగదీశ్‌తో, పోస్టుమార్టం నిర్వహించిన అనంతపురం సర్వజన ఆస్పత్రి ఫోరెన్సిక్ వైద్యులు, మృతదేహంపై ఉన్న గాయాలను పరిశీలించేందుకు సిటి స్కాన్ రేడియాలజీ విభాగానికి చెందిన వైద్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సుదీర్ఘంగా వారితో చర్చించారు. గుంతకల్లు రైల్వే స్టేషన్ నుంచి ప్రమాదం జరిగిన ఘటన వరకు జరిగిన రైలు ప్రయాణానికి సంబంధించి ఏమైనా ఆధారాలున్నాయా అనే కోణంలోనూ ఆరా తీసినట్లు సమాచారం.

ఆ గంటలో ఏమి జరిగింది?

పరకాణి కేసు విచారణకు హాజరయ్యేందుకు సతీష్‌కుమార్ శుక్రవారం రాత్రి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఎ-1 బోగి బెర్తు నెంబరు 29 ఆయనకు కేటాయించబడింది. రాత్రి 11.53 గంటలకు ఆయన గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు మోటర్ బైకుపై వచ్చిన దృశ్యాలు రైల్వేస్టేషన్ సిసి పుటేజీలో రికార్డు అయింది. రైలు నిర్ణీత సమయం కంటే అరగంట ఆలస్యంగా వచ్చింది. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఆ రైలు గుంతకల్లు రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరింది. ఈ నేపథ్యంలో సిఐ సతీష్ తాడిపత్రి మండలం కోమలి రైల్వేస్టేషన్ ప్రాంతంలో విగతజీవిగా పడి ఉన్నారు. కోమలి రైల్వే స్టేషన్‌ను అర్ధరాత్రి 2.04 గంటలకు రైలు దాటి వెళ్లింది. 2.09 గంటలకు తాడిపత్రి రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. సతీష్‌కుమార్ రైలు ఎక్కినప్పటి నుంచి మిగతా 7లో

పరకామణి కుంభకోణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ

- సిపిఎం డిమాండ్

3



ఆపిల్‌ను వీడనున్న టిమ్ కుక్..!


న్యూయార్క్ : దిగ్గజ టెక్, ఐఫోన్ల తయారీ సంస్థ ఆపిల్ సిఇఒ టిమ్ కుక్ ఆ సంస్థను వీడనున్నారని తెలుస్తోంది. ఈ నెలలో 65 ఏళ్లు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో ఆపిల్ కీలక బాధ్యతల నుంచి తప్పుకోనున్నారని రిపోర్టులు వస్తోన్నాయి. దీంతో టిమ్ కుక్ తర్వాత ఆపిల్‌కు తదుపరి సిఇఒ ఎవరేనేది ఆ పరిశ్రమ వర్గాల్లో చర్చ నడుస్తోంది. సంస్థలో పనిచేస్తున్న జాన్ టర్నస్ సిఇఒ రేసులో ఉన్నారని వినిపిస్తోంది. జాన్ ప్రస్తుతం ఆపిల్‌లో హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దాదాపు 24 సంవత్సరాలుగా జాన్ ఆపిల్‌లో పలు కీలక పదవులను చేపట్టారు.

దేశంలోనే బెస్ట్‌గా శ్రీసిటీ

- మరో ఆరు వేల ఎకరాల కేటాయింపు
- త్వరలో ఎయిర్ స్ట్రిప్ నిర్మాణం
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - విశాఖపట్నం

ప్రఖ్యాత పారిశ్రామిక వాడ శ్రీసిటీకి మరిన్ని మెరుగులు దిద్ది, దేశంలోనే బెస్ట్‌గా రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా శనివారం పలు కీలక రంగాల్లో పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్), రేమాండ్, శ్రీసిటీల ప్రతినిధులు చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు చేశారు. శ్రీసిటీకి సంబంధించిన ఐదు యూనిట్లను చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీసిటికి సంబంధించిన మరో 12 సంస్థలకు సంబంధించిన పెట్టుబడులపై సంతకాలు జరిగాయి. ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా ఉత్పత్తులకు సంబంధించి రూ.2,320 కోట్లతో ఈ నిర్మాణాలు జరుగుతాయి. దీనివల్ల 12,365 మందికి ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ శ్రీసిటీ అన్నది దేశంలోనే అతి పెద్ద పారిశ్రామిక కారిడార్‌గా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 30 వరకు పరిశ్రమలు ఉన్నాయని, త్వరలోనే 50 పరిశ్రమల స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. శ్రీసిటీ అభివృద్ధికి త్వరలోనే ఆరు వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తీసుకువస్తామని చంద్రబాబు ప్రకటించారు. శ్రీసిటీలో 50 దేశాలకు చెందిన సంస్థల ద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. సంస్థల రవాణా అవసరాల కోసం ఒక ఎయిర్‌స్ట్రిప్‌ను కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే బెల్జియం, జపాన్, బ్రిటన్, జర్మనీ,



సిఐఐ సమ్మిట్ వేదికపై వివిధ దేశాల కంపెనీల ప్రతినిధులతో సిఎం చంద్రబాబు

ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి హెల్త్‌కేర్, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, వైద్య పరికరాలవంటి వాటికి 8.87 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం ఇచ్చినట్లు చంద్రబాబు చెప్పారు. ఇక్కడ ఏర్పాటవుతున్న సంస్థల్లో వచ్చే ఒక సంస్థ ఉత్పత్తులు ఇంకో సంస్థకు ముడిసరుకుగా మారుతాయని, దీనివల్ల ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుందని అన్నారు. 2028 నాటికి శ్రీసిటీని అత్యుత్తమ పారిశ్రామిక ప్రాంతంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎమ్‌డి రవి సానారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో మరింతగా అభివృద్ధి సాధించేందుకు ప్రయత్నిస్తామన్నారు. వీలయినన్ని ఎక్కువ సంస్థలు ఇక్కడకు వచ్చేలా చూస్తామని హామీనిచ్చారు.

మూడు ప్రాంతాల్లో రేమాండ్

రేమాండ్ సంస్థతో కూడా అనేక ఒప్పందాలపై కూడా సంతకాలు జరిగాయి. మొత్తం మూడు ప్రాంతాల్లో రేమాండ్ సంస్థ పెట్టుబడులు పెడుతున్నట్లు చంద్రబాబు చెప్పారు. అనంతపురం జిల్లా రాప్తాడులో రూ.497 కోట్ల వ్యయంతో సిల్వర్ స్పార్క్ అపెరల్ యూనిట్‌ను ఏర్పాటుచేస్తున్నారు. అలాగే గుడిపల్లిలో రూ.441 కోట్లతో ఆటో కాంపోనెంట్ తయారు ప్లాంటును కియా ప్లాంట్‌కు దగ్గరలోనే ఏర్పాటుచేయనున్నారు. అదే జిల్లా తెలుకోడులో రూ.262 కోట్లతో ఏరో స్పేస్ పరికరాల తయారీ కేంద్రాన్ని కూడా ఏర్పాటుచేస్తున్నారు. ఈ మూడు పరిశ్రమల వల్ల 6,500 మందికి ఉపాధి లభిస్తుంది. 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యాన్ని 3, 4 సంవత్సరాల్లోనే సాధిస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఈ మూడు పరిశ్రమలను 2027 నాటికి ప్రారంభిస్తామని ఆ సంస్థ ప్రతినిధులు జతిన్ ఖన్నా, గౌతం మైనీ ప్రకటించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరో ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో సెంటర్ ఫర్ ఎనర్జీ, సైబర్ రెజిలియన్స్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఈ ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచం అంతా గ్రీన్ ఎనర్జీపైనే ఆలోచన చేస్తోందన్నారు. రాష్ట్రంలో 165 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని, అతి తక్కువ వ్యయంతో విద్యుదుత్పత్తి చేయాలన్నది లక్ష్యమని చెప్పారు. ఇంధన రంగానికి అవసరమైన సైబర్ రక్షణ వ్యవస్థను కూడా ఏర్పాటుచేయాల్సి అవసరం ఉందని వ్యాఖ్యానించారు. విద్యుత్ పంపిణీలో నష్టాలను అధిగమించడం, సరఫరా వ్యయం తగ్గించడం ద్వారా ఇంధన రంగంలో సుస్థిరత సాధ్యపడుతుందన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక ఎమ్‌డి జెర్మీ జుర్గెన్స్ మాట్లాడుతూ ఎఐ ట్రాన్సిషన్ సమయంలో ఇంధన వ్యవస్థల భద్రత అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో రాష్ట్రంలో తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి, ఇంధన భద్రత రంగాల్లో వేగవంతమైన నిర్ణయాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇటువంటి సమయంలో భద్రతపై రక్షణ వ్యవస్థలు కీలకమని, దీనికోసం నిపుణులతో కూడిన మానవ వనరులను తయారు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఆరు గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌ను విశాఖ తీసుకురావాలన్న ఆకాంక్ష సాకారమైందన్నారు. ఇటువంటి సంస్థకు కావాల్సిన విద్యుత్‌ను తయారు చేయడం ఒక సవాల్ అని, దానిని కూడా సాధ్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి, సిఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌జి కెమ్ ప్రతినిధులతో సిఎం చంద్రబాబు

ఎఐ యూనివర్సిటీ ఏర్పాటులో భాగస్వాములు కండి

- ఎల్‌జి కెమ్ ప్రతినిధులను కోరిన సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

సిఐఐ భాగస్వామ్య సదస్సులో రెండో రోజైన శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రముఖ సంస్థల ప్రతినిధులతో వరుసగా భేటీ అయ్యారు. ముందుగా ఎల్‌జి కెమ్ చీఫ్ సస్టైనబిలిటీ స్ట్రాటజీ ఆఫీసర్ యున్జోకోతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని కాకినాడ లేదంటే మూలపేటల్లో ఎల్‌జి కెమ్ నాఫ్తా క్రాకర్ కాంప్లెక్స్, పాలిమర్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. జెఎస్‌డబ్ల్యుతో కలిసి ఎల్‌జి కెమ్ ఏర్పాటు చేయదలచిన కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌కు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఎపి సర్క్యులర్ ఎకానమీ పాలసీలో భాగంగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు వీలుందని సిఎం సూచించారు. డేటా సెంటర్, ఎఐ, క్వాంటమ్... ఇలా అన్ని రంగాల్లో ఎపి ముందుకెళ్తోందని వివరించిన చంద్రబాబు... అబుదాబి తరహాలో రాష్ట్రంలో ఎఐ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని, ఇందులో భాగస్వామి కావాలని యున్జోకోను కోరారు.

ప్రముఖ గ్లోబల్ హాస్పిటాలిటీ గ్రూప్ అట్మాస్పియర్ కోర్ దక్షిణాసియా ఎమ్‌డి సౌవగ్య మొహాపాత్ర, గ్రూప్ ఎమ్‌డి సలీల్ పాణిగ్రాహితోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఆధునిక పర్యాటక రంగ అభివృద్ధి, ప్రీమియం లగ్జరీ హోటల్ పోర్ట్‌ఫోలియో విస్తరణ అంశాలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని తిరుపతి, విశాఖపట్నం, అమరావతిలో అట్మాస్పియర్ కోర్ చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని సిఎం అడిగి తెలుసుకున్నారు. ఈ మూడు ప్రాజెక్టులు వచ్చే మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని అట్మాస్పియర్ కోర్ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. గండికోటలో అడ్వంచర్ రిసార్ట్స్, అరకు-అనంతగిరిలో హిల్ రిసార్ట్స్ ఏర్పాటుకు యోచించాలని, బొబ్బిలి-విజయనగరం కోటలను పరిశీలించి వాటిని పర్యాటకంగా ఎలా అభివృద్ధి చేయవచ్చనే దానిపై అభిప్రాయం చెప్పాలని సిఎం కోరారు. రుషికొండలో వరల్డ్ క్లాస్ రిసార్ట్స్ నిర్మించేందుకు అట్మాస్పియర్ కోర్ ప్రతినిధులు ఆసక్తి వ్యక్తం చేశారు.

ఇఫ్కో ఛైర్మన్ దిలీప్ ననూభాయ్ సంఘానీతో చంద్రబాబు సమావేశమై గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్ ఆధారిత ఫెర్టిలైజర్ ప్లాంట్ల ఏర్పాటు, రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించే అంశాలపై చర్చించారు. బయో-ఫర్టిలైజర్, బయో-స్టిమ్యులెంట్ యూనిట్ల స్థాపనకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు మేలు చేకూరే విధంగా ఇఫ్కోతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

పర్యాటక రంగంలో ప్రముఖ సంస్థగా పేరుగాంచిన కోర్డెలియా క్రూయిజెస్ ప్రతినిధులతోనూ చంద్రబాబు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ తీర పర్యాటకాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని, అందుకు కోర్డెలియా క్రూయిజెస్ కలిసి రావాలని ఆ సంస్థ ప్రెసిడెంట్, సిఇఒ జుర్గెన్ బైలామ్‌ను కోరారు. విశాఖ - కాకినాడ - భీమునిపట్నం పోర్టుల నుంచి క్రూయిజ్ టూరిజం సేవలు అందించడంపై చంద్రబాబు చర్చించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకంగా క్రూయిజ్ టెర్మినల్ సౌకర్యాలు, బీచ్ టూరిజం, వాటర్ అడ్వెంచర్ స్పోర్ట్స్‌పై కోర్డెలియా క్రూయిజెస్ ఆసక్తి కనబరిచింది.

జపాన్ రాయబారి నోట... తెలుగు మాట

- సిఐఐ భాగస్వామ్య సదస్సులో ఆకట్టుకున్న ఓనో కెయిచ్చి ప్రసంగం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలో జరుగుతున్న సిఐఐ భాగస్వామ్య సదస్సులో జపాన్ దేశ రాయబారి ఓనో కెయిచ్చి తెలుగులోనే ప్రసంగం ప్రారంభించి అందరినీ ఆశ్చర్యపరిచారు. జపాన్ దేశంతో వాణిజ్య సంబంధాలపైన ఆయన ప్రసంగించారు. సిఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్నందుకు తాను చాలా గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సదస్సు ద్వారా జపాన్, భారత్ కంపెనీలు పరస్పర సహకారం అందిపుచ్చుకోవడంపై తాను సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. ఆయన ప్రసంగాన్ని అందరూ ఆసక్తిగా విన్నారు. 'నన్ను ఆహ్వానించినందుకు మీకు కృతజ్ఞతలు. తెలుగులో ఇదే నా మొదటి ప్రసంగం' అని ఎక్స్‌లో ఆయన పోస్టు పెట్టారు. జపాన్, ఎపిల మధ్య వాణిజ్య సంబంధాలు ఈ సదస్సు ద్వారా మరింత బలోపేతమవుతాయని తెలిపారు. స్టీల్, ఫార్మా, రిన్యూవబుల్ ఎనర్జీ రంగాల్లో, శ్రీసిటీ, టయోమా ప్రీఫెక్చర్ సంస్థలతో వాణిజ్య సహకారం కొనసాగిస్తున్నామన్నారు.



సిఎం చంద్రబాబుతో ఓనో కెయిచ్చి



వాణిజ్య సంస్థ ప్రతినిధులతో ఒప్పందం చేసుకుంటున్న మంత్రి లోకేష్

రాజధానిలో మరో మూడు నిర్మాణాలు

- పిపిపి పద్ధతిలో ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించిన సిఆర్‌డిఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పిపిపి) పద్ధతిలో మరో మూడు నిర్మాణాలను చేపట్టనున్నారు. దీనికోసం సిఆర్‌డిఎ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను ఆహ్వానించింది దీనిలో భాగంగా మందడం రెవెన్యూ గ్రామం పరిధిలో కృష్ణానదికి ఆనుకుని 19.72 ఎకరాల్లో ఒక నిర్మాణం చేపట్టనున్నారు. ఆర్4 జోన్లో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్ పరిధిలోని. ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. అలాగే పిచ్చుకలపాలెంలో పిపిపి ప్రాజెక్టుకు 7.93 ఎకరాలు కేటాయించారు. వీటితోపాటు రాయపూడి పరిధిలో 30.34 ఎకరాల్లో పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మొత్తం రెండో విడత మొత్తం 50 ఎకరాలను పిపిపి పద్ధతిలో అభివృద్ధికి కేటాయింపులు జరిపారు. అయితే ఈ నిర్మాణాలు దేనికోసమన్నది టెండర్లలో స్పష్టత ఇవ్వలేదు. కన్వెన్షన్ సెంటర్లను చేపట్టనున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సతీష్‌కుమార్ మరణం ముమ్మాటికీ హత్యే : వర్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరకామణి కేసు ఫిర్యాదారుడు సతీష్‌కుమార్ మరణంపై అనుమానాలున్నాయని, ఇది ముమ్మాటికీ హత్యే అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరకామణి దొంగతనం కేసు దర్యాప్తును ఎలా నీరుగార్చారు, రాజీ చేసిన అంశాలను ప్రస్తావించడం లేదన్నారు. 'పోలీసుల వేధింపులు సహించలేక బలవన్మరణం చేసుకున్నారు' అని సతీష్ మరణించిన వెంటనే వైసిపి అధికార ట్విట్టర్‌లో పోస్టు చేయడంపై రామయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. భూమన కరుణాకర్ రెడ్డి కూడా ఇదే విధంగా మాట్లాడటం గుమ్మడికాయ దొంగలు భుజాలు తడుముకున్నట్లుగా ఉందని విమర్శించారు. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైసిపి ట్వీట్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కేసు దర్యాప్తు చేసిన అధికారులు సిఐలు జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐ లక్ష్మీరెడ్డి ప్రాణాలకు ముప్పు ఉందని అనంతపురం ఎస్‌పి జగదీష్.. డిజిపికి లేఖ రాయాలన్నారు. దొంగతనం కేసులో ముద్దాయిగా ఉన్న రవికుమార్ ప్రాణాలకు కూడా తీవ్రమైన ముప్పు ఉందని, ధర్మారెడ్డి ప్రాణాలను కూడా పోలీసులు కాపాడాలని కోరారు. సతీష్‌కుమార్ హత్యతో వైసిపికి ఉలికిపాటు ఎందుకని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ప్రశ్నించారు. సతీష్ మృతదేహానికి పోస్టుమార్టం కూడా పూర్తికాకుండానే హత్యను ఆత్మహత్యగా టిటిడి మాజీ ఛైర్మన్ కరుణాకర్ రెడ్డి ఉపన్యాసం ఇచ్చేశారని తెలిపారు.

దళిత మహిళల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్

- హింసను అరికట్టేందుకు చర్యలు
- కెవిపిఎస్ సెమినార్‌లో వక్తల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళిత మహిళల అభివృద్ధికి ఎస్‌సి సబ్‌ప్లాన్ ప్రత్యేక బడ్జెట్ నిధులు కేటాయించాలని కెవిపిఎస్ నిర్వహించిన సెమినార్‌లో వక్తలు డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై కెవిపిఎస్ ఆధ్వర్యాన 'మహిళలు-సామాజిక న్యాయం' అనే అంశంపై సెమినార్ శనివారం జరిగింది. విజయవాడలోని పూలే-అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ ఉపాధ్యక్షులు బాగం లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు డి రమాదేవి మాట్లాడుతూ.. దళిత మహిళలు సమాన హక్కులు, విద్యను పొందేందుకు రాజ్యాంగం హామీ ఇచ్చిందని చెప్పారు. కానీ ఆర్థిక, సామాజిక, లింగ, కుల ఆధారిత వివక్ష ఇంకా కొనసాగుతోందని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే, బిఆర్ అంబేద్కర్, వామపక్షాల ఉద్యమాలతో కొన్ని రక్షణ చట్టాలు వచ్చాయని చెప్పారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధికి దూరంగా వలస కూలీలుగా మహిళలే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని స్థాయిల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కుల, మత ఆధారిత హింసను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, మహిళా రక్షణ చట్టాలను అమలు చేయాలని పేర్కొన్నారు. వైద్యం, ఆరోగ్య సూచికలు గ్రామీణ భారతదేశంలో పేలవంగా ఉన్నాయని చెప్పారు. అధిక ప్రసూతి మరణాల రేట్లు, పోషకాహార లోపం, ఆరోగ్య సంరక్షణ లేకపోవడం వంటి కీలక సమస్యలున్నాయని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు నిధులు పెంచాలని కోరారు. శ్రామిక మహిళా కన్వీనర్ కె ధనలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న హింస ఘటనలు ఆందోళనకరంగా ఉన్నాయని చెప్పారు. ప్రతియేటా ఈ ఘటనలు పెరుగుతున్నాయే తప్ప నియంత్రణ ఉండటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, గృహ హింస వంటి చట్టాలున్నా సరిగ్గా అమలు కావడం లేదని తెలిపారు. మద్యం, మాదక ద్రవ్యాలు, నిరుద్యోగం, పేదరికం, రాజకీయ అణచివేతలు హింసకు మూల కారణాలుగా నిలుస్తున్నాయని చెప్పారు. కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై దుర్మార్గమైన దాడులు జరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో పాలకులు విఫలమవుతున్నారని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు జరగాలని కోరారు. దళిత మహిళల అభివృద్ధికి ఎస్‌సి సబ్‌ప్లాన్ ప్రత్యేక బడ్జెట్ నిధులు కేటాయించాలని కెవిపిఎస్ నాయకులు జి అరుణమ్మ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. గిరిజన ఉద్యమ నాయకులు బిర్సాముండా జయంతి సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి వక్తలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ అధ్యక్షులు ఓ నల్లప్ప, రాష్ట్ర కమిటీ సభ్యులు కె రంగమ్మ, విజయమ్మ, టి క్రాంతికుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట ప్రణాళిక : పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట ప్రణాళికను రూపొందించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఎర్రచందనం పరిరక్షణ, అక్రమ రవాణా నిరోధానికి ఉన్న మార్గాలపై అటవీశాఖ ఉన్నతాధికారులతో శనివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవస్థలన్నీ సమన్వయంతో పనిచేస్తే అక్రమార్కుల ఆటకట్టించడం అసాధ్యం కాదని చెప్పారు. అక్రమ రవాణా నిరోధానికి అందుబాటులో ఉన్న సాంకేతిక వినియోగానికి తోడు సిబ్బంది కృషి చాలా అవసరమని పవన్ కల్యాణ్ చెప్పారు. టెక్నాలజీతో పాటు సంకల్పం తోడైతేనే అక్రమ రవాణాను నిరోధించగలమని తెలిపారు. పోలీస్, అటవీ అధికారుల ఆధ్వర్యంలో నిరంతరం ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగే అవకాశం ఉన్న ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్ల వద్ద థర్మల్ డ్రోన్లతో నిఘాను పెంచాలని ఆదేశించారు. అటవీ చెక్ పోస్టులను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు సిసి కెమెరాలను అమర్చి, నిత్యం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. సరికొత్త బారికేడ్లను చెక్‌పోస్టుల వద్ద అమర్చి, బేస్ క్యాంపులు, వాచ్ టవర్లలో గస్తీ ముమ్మరం చేయాలని పేర్కొన్నారు. ఎర్రచందనం విక్రయాల ద్వారా సమకూరే ఆదాయంలో నిర్దేశిత శాతం ఎర్రచందనం విత్తనాలు జల్లడం, వనాలు అభివృద్ధి, సంరక్షణకు కేటాయించే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. చెట్లను నరకడానికి వస్తున్న కూలీలు, మేస్త్రీలు, సూపర్‌వైజర్లు, గోదాము కీపర్లు వంటి కిందిస్థాయి వారిని గుర్తించి చట్టంపై అవగాహన కల్పించి కౌన్సిలింగ్ చేయాలని చెప్పారు. ఇతర ఉపాధి మార్గాలు వారికి చూపించాల్సిన అవసరం ఉందన్నారు. సరిహద్దులు దాటి వేర్వేరు ప్రాంతాల్లో పట్టుకున్నా, దానిని గత ప్రభుత్వం వెనక్కు తీసుకురాలేకపోయారని పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి అక్రమంగా రవాణా అయిన దుంగలు దేశంలో ఎక్కడ దొరికినా రాష్ట్రానికి చెందేలా కేంద్రం నుంచి ఆదేశాలు ఇప్పించానని చెప్పారు. దీంతో ఇతర చోట్ల ఉన్న ఎర్రచందనం తిగిరి రాష్ట్రానికి రప్పించే ప్రక్రియ మొదలైందన్నారు.

రెడ్‌క్రాస్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి రెడ్‌క్రాస్ సొసైటీ నూతన పాలకవర్గం ఎన్నిక విజయవాడలో జరిగింది. రాష్ట్రంలోని 22 జిల్లాల నుంచి వచ్చిన రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు కాకినాడకు చెందిన వైడి రామారావును ఛైర్మన్‌గా, గుంటూరుకు చెందిన పి రామచంద్రరాజును వైస్ ఛైర్మన్‌గా, తిరుపతికి చెందిన డి శ్రీహరిరావును కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రెడ్‌క్రాస్ సంస్థ ముఖ్యకార్యదర్శి, ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఎకె ఫరిడా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో ఫరిడా ప్రమాణస్వీకారం చేయించారు. ఛైర్మన్ రామారావు మాట్లాడుతూ.. అత్యుత్తమమైన సేవలు అందించి రాష్ట్ర శాఖను దేశంలోనే అగ్రభాగాన ఉంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.



హిందూపురం వైసిపి కార్యాలయంలో ధ్వంసమైన ఫర్నీచర్

హిందూపురం వైసిపి కార్యాలయంపై దాడి

- ఫర్నీచర్ ధ్వంసం చేసిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - హిందూపురం


శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో శనివారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. లేపాక్షి మండలంలో శనివారం జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త వేణురెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ స్థానికుడు కాదని, హిందూపురం అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శలు చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో టిడిపి శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. హిందూపురంలోని వైసిపి కార్యాలయంపై మూకుమ్మడి దాడికి పాల్పడ్డాయి. ఫర్నీచర్‌తో పాటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశాయి. వైసిపి నాయకులు కార్యాలయం వద్దకు చేరుకుని ఖండించారు. అక్కడి నుంచి వన్‌టౌన్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి స్టేషన్ ముందు ధర్నా నిర్వహించి, దాడి చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా పార్టీ అధ్యక్షులు ఉషశ్రీ చరణ్, వేణు రెడ్డి ఇతర నాయకులు సిఐకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. టిడిపి నాయకులు అంబేద్కర్ సర్కిల్లో రోడ్డుపై బైఠాయించి బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వేణురెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరు పార్టీల వారు ఆందోళనలకు దిగడంతో పోలీసులు సర్దిచెప్పి ఆందోళనలను విరమింపజేశారు.

దాడి సరికాదు : సిపిఎం

వైసిపి కార్యాలయంపై టిడిపి అల్లరి మూకలు చేసిన దాడిని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జెడ్‌పి.శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు. ఏ పార్టీకి అధికారం శాశ్వతం కాదని, ప్రతిపక్షంలో ఎవరు ఉన్నా విమర్శలు చేయడం సర్వసాధారణమని, అధికారంలో ఉన్న వారు ఇలా దాడులు చేయడం సరికాదని అన్నారు. నియోజకవర్గంలో తప్పుని ఎత్తి చూపిన పాత్రికేయులపై సైతం తప్పుడు కేసులు బనాయించడం తగదన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ వీటిని పరిశీలన చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు.

'ఉక్కు' కార్మికుల వేతనంపై మెలిక

- సర్క్యులర్ జారీ చేసిన యాజమాన్యం
- భగ్గుమన్న కార్మికులు, కార్మిక సంఘాలు



RASHTRIYA ISPAT NIGAM LIMITED
VISAKHAPATNAM STEEL PLANT

HR DEPARTMENT-CORPORATE SERVICES

MISC. CIRCULAR NO.03/2025

Ref:No.:2025/HR/CS Date: 15.11.2025

Sub: Disbursement of salary proportionate to the achieved capacity utilization targets

1. Full salary has been paid to the employees from the month of September, 2025 onwards. However, due to non-fulfillment of production targets, which have adversely impacted the earnings of the Organization, salary from the month of November, 2025 onwards shall be disbursed proportionate to the target(s) achieved.
2. The targets fixed for the month of November, 2025 are as follows:
   a. Sinter Plant: 24,000 tons of Gross Sinter per day (average)
   b. Blast Furnace: 19,000 tons of Hot Metal per day (average)
   c. SMS: 125 heats per day (average for SMS-1 & 2 combined)
   d. CO & CCP: 370 pushings per day (average)
   e. Rolling Mills: 13,500 tons of Finished Products per day (average)
   f. Marketing: 15,000 tons of sales per day (average)

   Targets for subsequent months shall be reviewed as appropriate.
3. For the employees of all other departments including Services & Non-works departments, salary shall be disbursed proportionate to the average of the targets achieved by the departments figured at 2(a) to 2(f) above (Plant Average).
4. For the employees of Material Management (MM) Department, salary shall be disbursed based on the Plant Average, subject to receipt of at least 27 rakes of coke (or equivalent quantity) in the plant during the month. In case of shortfall, the Plant Average for MM department shall be adjusted accordingly.

This issues with the approval of Competent Authority.

(Anjali V Topno)
DGM(HR)-CE &CS

Distribution:
Standard

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ దర్శకత్వంలో నడుస్తోన్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మరో దుర్మార్గమైన సర్క్యులర్‌ను శనివారం జారీ చేసింది. స్టీల్ ప్లాంట్ ఉత్పత్తికి, కార్మికుల వేతనాలకు మెలిక పెట్టింది. ప్లాంట్‌లో నవంబర్ నుంచి ఉత్పత్తి లక్ష్యాల ఆధారంగా వేతనాలు చెల్లించబడతాయని ఈ సర్క్యులర్‌లో పేర్కొంది. ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగం నుంచి ఈ సర్క్యులర్ వెలువడింది. సెప్టెంబర్ 2025 వరకు పూర్తి వేతనం ఇచ్చినా ఉత్పత్తి లక్ష్యాలు నెరవేరకపోవడంతో సంస్థపై ఆర్థిక ప్రభావం పడిందని, ఈ దృష్ట్యా ఇకపై లక్ష్యాలను చేరుకుంటేనే పూర్తి వేతనాలు అందిస్తామని, లేకపోతే కోత విధిస్తామని ప్లాంట్ యాజమాన్యం పేర్కొంది. వివిధ విభాగాలకు రోజువారీ లక్ష్యాలను విధించి, ఆ వివరాలను సర్క్యులర్‌లో తెలియజేసింది. మెటీరియల్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కోసం ప్రత్యేక నిబంధనలు దానిలో పొందుపరిచింది. ఎంఎం విభాగ ఉద్యోగుల వేతనం కూడా ప్లాంట్ యావరేజ్ ఆధారంగానే ఉంటుందని తెలిపింది. దీనిపై కార్మికులు, కార్మిక సంఘాల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ, యాజమాన్య దుర్మార్గానికి నిదర్శనం : కార్మిక సంఘాలు

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విడుదల చేసిన ఈ సర్క్యులర్‌పై కార్మిక సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు జె.అయోధ్యరామ్, కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్క్యులర్‌లో యాజమాన్యం, ప్రభుత్వం కండకావరం కనిపిస్తోందన్నారు. ఉద్యోగుల ఉత్పత్తి పర్సెంటేజీని బట్టి జీతాలిస్తామని చెప్పడం దుర్మార్గమని తెలిపారు. దీనిపై పోరాటానికి దిగకపోతే ఇంటికి వచ్చి మరీ బెదిరింపులకు గురి చేస్తారన్నారు. బ్లాస్ట్‌ఫర్నేస్ ఏర్పడిన తర్వాత 17 వేల టన్నులు దాటి ఉత్పత్తి తీయగలిగారా? అని ప్రశ్నించారు. కార్మిక సంఘాలతో, ఎగ్జిక్యూటివ్‌లతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని కార్మికులపై రుద్దడం తగదన్నారు. యాజమాన్య పెద్దలు, ఢిల్లీలోని పెద్దలు ఇచ్చిన టార్గెట్లను ఒక నెల రోజులు తీసి చూపిస్తే, ఉద్యోగాలు వదిలి బయటకుపోతామన్నారు. సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయకుంటే సోమవారం పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఐటి ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుటుంబ కలహాలతో ఐటి ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... హైదరాబాద్ గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివశిస్తున్న విశాల్ గౌడ్ (28) టిసిఎస్‌లో ఉద్యోగం చేస్తూ.. 2023 డిసెంబర్‌లో నవ్యను వివాహం చేసుకున్నారు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో ఈ ఏడాది మార్చిలో నవ్య తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. రెండు నెలల క్రితం నవ్య ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసుల నుంచి విశాల్‌కు ఫోన్ రావడంతో కౌన్సెలింగుకు హాజరయ్యారు. అనంతరం కేసు నమోదు కావడంతో స్టేషనుకు రమ్మని మరోసారి పోలీసులు ఫోన్ చేశారు. మనస్తాపానికి గురైన విశాల్‌గౌడ్ తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

రేపటి నుంచి ఐసిఎల్ ఫిన్‌కార్ప్ కొత్త ఎన్‌సిడి ఇష్యూ

ప్రజాశక్తి - హైదరాబాద్

సెక్యూర్డ్ రిడీమబుల్ నాన్ కన్వర్టేబుల్ డిబెంచర్స్ (ఎన్‌సిడి) ఇష్యూను జారీ చేస్తోన్నట్లు ఐసిఎల్ ఫిన్‌కార్ప్ తెలిపింది. ఈ ఇష్యూ నవంబర్ 17న తెరువబడి.. 28 వరకు అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. ఇందులో పెట్టుబడులపై ఏడాదికి గరిష్టంగా 12.62 శాతం వరకు రాబడిని అందించనున్నట్లు ఆ సంస్థ సిఎండి కెజి అనిల్ కుమార్ తెలిపారు. ఈ ఎన్‌సిడికి క్రిసిల్ బిబిబిమైనస్ స్టేబుల్ రేటింగ్ ఉందన్నారు. ఈ ఎన్‌సిడిలను 13, 24, 36, 60, 70 నెలల కాలపరిమితితో విడుదల చేస్తున్నామన్నారు. వార్షిక వడ్డీ రేటు 10.50 శాతం 12.62 శాతంగా ఉంటుందన్నారు. కనీస దరఖాస్తు రూ.10,000 నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ ఇష్యూ నిధులను ఐసిఎల్ ఫిన్‌కార్ప్ వృద్ధికి మద్దతునిచ్చే కార్యక్రమాలకు ఉపయోగించనున్నామన్నారు. వినియోగదారులు, వాటాదారుల సేవల నాణ్యతను పెంచనున్నామని చెప్పారు.

వృద్ధ దంపతులపై ఏనుగుల దాడి

- భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు
- కుప్పం సరిహద్దుల్లో ఘటన

ప్రజాశక్తి - కుప్పం

ఏనుగుల గుంపు ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రెండు రోజుల క్రితం కుప్పం మండలం కూర్మాయిపల్లి వద్ద ఒంటరి ఏనుగు రైతు కిట్టప్పను తొక్కి చంపగా, శనివారం వేకువ జామున కుప్పం సరిహద్దులోని తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా బరుగూరు సమీపంలోని జగనికొల్లై గ్రామ సమీపంలో (ఆంధ్ర సరిహద్దుకు నాలుగు కిలోమీటర్లు) వ్యవసాయ పొలం వద్ద ఉన్న వృద్ధ దంపతులపై ఐదు ఏనుగుల గుంపు దాడి చేసింది. ఈ దాడిలో జీవమ్మా (63), గోవిందన్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బరుగూరు ఆస్పత్రికి తరలించగా జీవమ్మ మృతి చెందారు. గోవిందన్ చికిత్స పొందుతున్నారు. గ్రామం వైపు వచ్చిన ఏనుగుల మందను వేకువజామున స్థానికులు అటవీ సిబ్బంది పెద్ద ఎత్తున టపాసులు కాలుస్తూ కుప్పం అటవీ ప్రాంతం వైపు మళ్లించారు. దీంతో కుప్పం అటవీ సిబ్బంది అప్రమత్తమై ఏనుగులు గ్రామాల వైపు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతంలో ఏనుగుల కదిలికలను డ్రోన్ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నట్లు కుప్పం ఎఫ్ఆర్ఒ జయశంకర్ తెలిపారు.



టిటిడికి ఎలక్రిక్ బస్సు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

పూణేకు చెందిన పినాకిల్ మొబిలిటి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.74.24 లక్షల విలువైన విద్యుత్ బస్సును శనివారం టిటిడికి విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయం ఎదుట బస్సు తాళాలను డిప్యూటి ఇఒ లోకనాథంకు అందజేశారు. తిరుమల ట్రాన్స్‌పోర్ట్ డిఐ వెంకటాద్రి నాయుడు పాల్గొన్నారు.

సింగపూర్‌కు నేరుగా ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు (గన్నవరం)

గన్నవరం నుంచి నేరుగా సింగపూర్ వెళ్లేందుకు విమాన సర్వీసులు శనివారం ప్రారంభమయ్యాయి. ఐదేళ్ల తర్వాత ఇండిగో ఎయిర్ లైన్స్ వారు సింగపూర్ వెళ్లేందుకు విమాన సర్వీసులను మళ్లీ ప్రారంభించారు. వారంలో మూడు రోజులు మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

భారత క్రికెటర్ శ్రీచరణికి టిటిడి చైర్మన్ అభినందనలు

ప్రజాశక్తి - తిరుమల

ఇటీవల జరిగిన మహిళా క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత్ జట్టు ఘన విజయం సాధించడంలో కీలకపాత్ర వహించిన కడప జిల్లాకు చెందిన భారత మహిళా క్రికెటర్ శ్రీచరణిని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు అభినందించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం శ్రీ చరణి శనివారం తిరుమలలోని క్యాంప్ కార్యాలయంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువతో సత్కరించి, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో క్రికెట్లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని బిఆర్ నాయుడు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ఉన్నారు.



తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి)

విశాఖ లంకెలపాలెం సమీప గొల్లపేటలోని ఓ స్క్రాప్ దుకాణంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు భారీగా ఎగసిపడ్డాయి. అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన ఫార్మా రసాయన డ్రమ్ములు దగ్ధమయ్యాయి. ఆ సమయంలో దట్టమైన నల్లని పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేసింది. స్థానికులు ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడ్డారు. తలుపులు వేసుకుని ఇళ్లలోనే ఉండిపోయారు. అగ్నిమాపక సిబ్బంది గంటల తరబడి శ్రమించి మంటలను అదుపుచేశారు. అనకాపల్లి జిల్లా పిసిబి అధికారులు, పరవాడ పోలీసుల కళ్లముందే కొందరు ఈ ఫార్మా వ్యర్థాలను తీసుకొచ్చి తుక్కు దుకాణాల్లో దాచిపెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజా ప్రమాదంపై సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఫార్మా వ్యర్థాలను తుక్కు దుకాణాల్లో నిల్వ చేయడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడమే అవుతుందన్నారు. కాలుష్య నియంత్రణ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. జనావాసాల మధ్య ప్రమాదకర వ్యర్థాలను నిల్వ చేసే కేంద్రాలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు.

అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరణ కోరుతూ

27న సిసిఎల్ఎ కార్యాలయం ఎదుట ధర్నా

- ఉమ్మడి వ్యవసాయ కార్మిక సంఘాల చర్చావేదిక



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసైన్డ్ భూములకు రక్షణ కవచంగా ఉన్న 9/77 అసైన్డ్ చట్టాన్ని సవరిస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. అసైన్డ్ చట్టాన్ని ఉపసంహరణ కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 27న మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయం ఎదుట పెద్దయెత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర స్థాయి చర్చావేదిక తీర్మానించింది. విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో శనివారం ఉమ్మడి వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఎపి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భూ బదలాయింపు చట్టాన్ని ఉపసంహరించుకోవాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని చర్చావేదిక అభిప్రాయపడింది.

సిసిఎల్ఎ కార్యాలయం ముందు ధర్నాతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ధర్నాలు చేయాలనే తీర్మానాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ప్రవేశపెట్టగా, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ బలపరిచారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భూ బ్యాంకుల పేరుతో కూటమి ప్రభుత్వం పేదల అసైన్డ్ భూమిని పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్లకు కేటాయించేందుకు ఈ సవరణ చేస్తోందన్నారు. అసైన్‌మెంట్ భూములు పేదల చేతుల్లోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మకాలు, కొనుగోలు (భూ బదలాయింపు నిషేధం) చేయరాదన్న ఫ్రీహోల్డ్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి పెద్దలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది దళిత, బలహీనవర్గాల పేదలకు తీవ్ర ద్రోహం చేస్తోందన్నారు.

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ.. వామపక్షాలు, ప్రజా సంఘాల పోరాటాల ఫలితంగా 1977లో అసైన్డ్ చట్టం వచ్చిందని, పేదలకిచ్చిన భూములను పేదలే అనుభవించాలని, అన్యాక్రాంతం చేయడానికి వీలులేదని చట్టం చెబుతోందన్నారు. పెట్టుబడిదారుల కోసం పేదలకు అన్యాయం చేస్తూ కూటమి ప్రభుత్వం అసైన్డ్ చట్ట సవరణకు పూనుకుంటోందని ఆయన విమర్శించారు. ఆవుల శేఖర్ మాట్లాడుతూ.. పేదల భూములకు రక్షణ కవచంగా ఉన్న అసైన్డ్ చట్టానికి గత 20 ఏళ్లుగా పాలకులు తూట్లు పొడుస్తున్నారని, నేడు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇందుకు పరాకాష్ట అని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేదలు, బడుగులు, దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. గత వైసిపి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు 20 ఏళ్ల తర్వాత అమ్మకాలు, కొనుగోలు చేయొచ్చంటూ అసైన్డ్ చట్టాన్ని సవరించిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఏకంగా 99 సంవత్సరాల లీజు పేరుతో అసైన్డ్ చట్టాన్ని సవరణకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని, వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాలకు ప్రతిఒక్కరూ మద్దతునివ్వాలని కోరారు.

ఈ చర్చావేదిక కార్యక్రమంలో వ్యవసాయ, ఎఐకెఎఫ్, ఎపి కౌలురైతు సంఘం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు వై కేశవరావు, వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, ఎం హరిబాబు, రామన్న, సూర్యారావు, వివి నాగరాణి, ప్రసన్నకుమార్‌తో పాటు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సాయిబాబా సమాధిని దర్శించుకుంటున్న పీయూష్ గోయల్

సాయిబాబా మహాసమాధిని దర్శించుకున్న ప్రముఖులు

- సిజెఐ బి.ఆర్ గవాయ్, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్, ఉంగుటూరు

శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.రామకృష్ణ గవాయ్ శనివారం పుట్టపర్తికి వచ్చారు. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభ మండపంలో కొద్దిసేపు గడిపిన అనంతరం సత్య సాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. తొలుత గన్నవరం విమానాశ్రయంలో సిజెఐకు ఎపి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం ఘన స్వాగతం పలికింది. పుట్టపర్తి విమానాశ్రయంలో అనంతపురం జిల్లా జడ్జి ఇ.భీమారావు, కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ తదితరులు స్వాగతం పలికారు.

టిటిడి పరకామణి కుంభకోణంపై

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ

- సిపిఎం డిమాండ్
- ఎవిఎస్ఒ సతీష్ మృతి వెనుక కుట్రలను చేధించాలి
- జర్నలిస్టు శ్రీనివాసులుకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిటిడి పరకామణి కుంభకోణంపైనా, ఆ వ్యవస్థలోని లోపాలు, వైఫల్యాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, అవినీతికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎవిఎస్ఒ సతీష్ మృతివెనుక కుట్రలను చేధించాలని, జర్నలిస్టు శ్రీనివాసులుకు రక్షణ కల్పించాలని ఈ ప్రకటనలో ఆయన కోరారు. పరకామణిలో జరిగిన దొంగతనంపై ఫిర్యాదు చేసిన నాటి ఎవిఎస్ఒ సతీష్ కుమార్ రైలు పట్టాలపై శవమై తేలడం, దీనిని ప్రాథమికంగా వైద్యులు హత్యగా నిర్ధారణ చేయడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక ఉన్న అసలు పాత్రదారులు, సూత్రధారులు తప్పించుకోవడానికి సతీష్ కుమార్‌ను బలి తీసుకున్నట్టుగా భావించాల్సి వస్తోందని తెలిపారు. ఈ కేసు వెలుగులోకి రావడానికి కారణమైన జర్నలిస్టు శ్రీనివాసులు తనకు రక్షణ కల్పించాలని తిరుపతి జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడికి నాడు మొరపెట్టుకున్నారంటే పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందన్నారు. రవికుమార్ అనే నిందితుడిని చట్టప్రకారం జైలుకు పంపి చర్యలు తీసుకోకుండా రూ.140 కోట్ల రూపాయల ఆస్తులను టిటిడి పేరిట రాయించుకుని ఫిర్యాదుదారు సతీష్ కుమార్‌తో లోక్ అదాలత్‌లో రాజీ చేయించడం పట్ల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. డిజి స్థాయి అధికారితో హైకోర్టు విచారణ చేయిస్తున్న సందర్భంలో సతీష్ కుమార్ హత్య అనేక ప్రశ్నలను లేవనెత్తుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 35 ఏళ్లుగా చిన్నజియ్యర్ మఠం నుంచి పరకామణిలో పర్యవేక్షణకు వస్తున్న రవికుమార్ సాదాసీదా ఉద్యోగి అయ్యుండి వందల కోట్లు ఎలా సంపాదించాడని శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఇంకా ఇలాంటి వ్యక్తులు, శక్తులు ఎందరున్నారు. పరకామణి వ్యవస్థలో ఉన్న లోపాలు ఏమిటి? అనే అశాలపై సమగ్రంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని అన్నారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో అన్ని పార్శ్వాలలో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని, పరకామణి వ్యవస్థను పటిష్ట పరచాలని, ప్రజలకు, భక్తులకు వాస్తవాలు వెల్లడించి టిటిడి నిర్వహణపై భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

మతోన్మాద ఉగ్రదాడులను ఖండించండి

- ప్రజా సంఘాల కమిటీలు పిలుపు

ప్రజాశక్తి-నెల్లూరు

మతోన్మాద ఉగ్రదాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన చేపట్టారు. మతోన్మాదం-ఉగ్రవాదం నశించాలని, ఢిల్లీలో జరిగిన ఉగ్రవాద దాడులను ఖండించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.వి. రమణ మాట్లాడుతూ.. మతోన్మాద ఉగ్రదాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ... నిందితులు ఏ మతం వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు శివకుమారి మాట్లాడుతూ... దాడుల్లో చనిపోయిన వారి కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉంటుందని, దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. డాక్టర్ రఫీ మాట్లాడుతూ... మతం ఆధారంగా ఏ దాడి జరిగిన లౌకిక భారతదేశంలో ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండా ప్రసాద్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ అజీజ్, కాంగ్రెస్ మైనారిటీ నాయకులు హనీఫ్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ, జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బిపి నరసింహ, ఐద్వా జిల్లా నాయకులు సుబ్బమ్మ, షంషాద్ పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు అరెస్టు

- మదనపల్లె డిఎస్‌పి మహేంద్ర

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా మదనపల్లె గ్లోబల్ ఆస్పత్రి కేంద్రంగా నడిచిన కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర శనివారం విలేకరులకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి పట్టణం ఎస్‌బిఐ కాలనీ కేంద్రంగా గ్లోబల్ ఆస్పత్రి యజమాని, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డిసిహెచ్ఎస్) డాక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో 15 మందితో కూడిన బృందం కిడ్నీ రాకెట్‌లో ఉన్నట్లు నిర్ధారించారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం, బొడ్డపాలేనికి చెందిన యమున (29)ను ఈ నెల 9న పథకం ప్రకారం కిడ్నీ రాకెట్ ముఠా సభ్యులు మదనపల్లి గ్లోబల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. యమునతో పాటు మరొకరి కిడ్నీని అదే రోజు తొలగించారు. వైద్యం వికటించి యమున మరణించారు. ఈ కేసులో డాక్టర్ ఆంజనేయులు, మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోని అపోలో డయాలసిస్ మేనేజర్ బాలరంగడు, పుట్టపర్తి జిల్లా కదిరి డయాలసిస్ మేనేజర్ మెహరాజ్, కిడ్నీ రాకెట్‌లో కీలక పాత్ర పోషించిన విశాఖపట్నానికి చెందిన పెళ్లి పద్మ, కాకర్ల సత్య, యమున ప్రియుడు సూరిబాబును అరెస్టు చేశారు. బెంగళూరుకు చెందిన డాక్టర్‌తో మరో ఎనిమిది మంది నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని డిఎస్‌పి తెలిపారు.

భారత బొమ్మలకూ ఆర్డర్లు తగ్గాయ్

- అమెరికా సుంకాల దెబ్బ
- ఎగుమతిదారులపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన అధిక సుంకాలు దేశ బొమ్మల తయారీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సుంకాలు పెరగడం వల్ల అమెరికా నుంచి వచ్చే ఆర్డర్‌లలో 50 శాతం వరకు తగ్గుదల నమోదయ్యింది. ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలతో అమెరికాకు ఎగుమతి అయ్యే బొమ్మల పరిశ్రమతో పాటు, వస్త్రాలు, తోలు, రత్నాలు, ఆభరణాలు, సముద్ర ఉత్పత్తులు వంటి ఇతర శ్రమాధారిత రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోన్న విషయం తెలిసిందే.

భారత్‌పై అధిక టారిఫ్‌లతో మన పరిశ్రమ బొమ్మల ధరలు యుఎస్‌లో ప్రియమయ్యాయి. చౌకగా లభించే చైనా, వియత్నాం వంటి ఇతర పోటీదారుల వైపు దిగుమతిదారులు మళ్లుతున్నారు. దీని ఫలితంగా భారత్‌కు ఆర్డర్లు భారీగా తగ్గాయి. అధిక సుంకాల కారణంగా, అమెరికా మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులు తమ పోటీతత్వాన్ని కోల్పోయాయి. ఎగుమతిదారులు పోటీలో నిలబడటానికి ధరలను తగ్గించడం లేదా డిజైన్లను మెరుగుపరచడం వంటి చర్యలు తీసుకోవాలని.. కానీ ఇది వ్యయంతో కూడుకున్నదని ఆ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం ఎగుమతి మార్కెట్లను వైవిధ్యపరచడం, దేశీయ తయారీని ప్రోత్సహించడం వంటి చర్యలను చేపట్టాల్సిన అవసరం ఉందని పరిశ్రమ వర్గాలు సూచిస్తున్నాయి.

ఒకప్పుడు భారత బొమ్మలకు అమెరికాలో మంచి డిమాండ్ ఉండేది. చౌకగా లభించడంతో ఇతర దేశాల ఉత్పత్తులతో పోటీ పడగలిగేవి. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా మారిందని టాయ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గవర్నింగ్ బాడీ సభ్యుడు అమితాబ్ ఖర్బంద పేర్కొన్నారు. క్రిస్మస్ పండగ కోసం సాధారణంగా అక్టోబర్-నవంబర్ మధ్య వచ్చే



ఆర్డర్లు ఈ ఏడాది సగం మేర తగ్గాయన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు కాలంలో 64.5 మిలియన్ డాలర్ల బొమ్మల ఎగుమతులు జరిగాయి. గతేడాది మొత్తం ఎగుమతుల్లో 78 శాతం చేరుకున్నప్పటికీ.. ఇకపై గడ్డుకాలమేనని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ట్రంప్ అధిక సుంకాలకు ముందు భారీగా ఎగుమతులు జరగడంతో కొంత ఉపశమనం లభించిందని పేర్కొన్నాయి. ఆగస్టు 1 నాటికి భారత్‌పై 25 శాతంగా ఉన్న సుంకాలను.. ఆగస్టు 27 నాటికి టారిఫ్‌లను 50 శాతానికి పెంచుతూ ట్రంప్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.



బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న లోకనాథం, చిత్రంలో సురేంద్ర, అప్పలనర్స తదితరులు

బిర్సాముండా స్ఫూర్తితో పోరాటాలు

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా)

ఆదివాసీ పోరాట యోధుడు బిర్సా ముండా స్ఫూర్తితో హైడ్రో ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం ఉద్ఘాటించారు. బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జయంతి కార్యక్రమం నిర్వహించారు. పాడేరు ఎపిఎన్‌జిఒ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా బిర్సా ముండా చిత్రపటానికి లోకనాథం, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో లోకనాథం మాట్లాడుతూ.. ఆదివాసీ మహిళలను గతంలో కించపరిచిన ఒడిశా ముఖ్యమంత్రికి ఆంధ్రాలో బిర్సా ముండా విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు లేదన్నారు. ఆంధ్ర - ఒడిశా సరిహద్దు వివాదాన్ని పరిష్కరించాలని ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాఝీని డిమాండ్ చేశారు. రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి నియోజకవర్గంలోని కొటియా గ్రామాల సమస్యలు తీవ్రమవుతున్నాయని, అవి అంతర్రాష్ట్ర ఘర్షణకు దారితీస్తున్నాయని తెలిపారు. ఆ సమస్యనూ పరిష్కరించాలని కోరారు.

పలుచోట్ల జయంతి వేడుకలు

బిర్సా ముండా జయంతి వేడుకలు అల్లూరి జిల్లాలో వాడవాడలా సాగాయి. రంపచోడవరం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి హాజరయ్యారు. పాడేరు ఐటిడిఎలో బిర్సా ముండా విగ్రహానికి మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ అసిస్టెంట్ సెక్షన్ అధికారి రాహుల్ పురానా నివాళులర్పించారు. హుకుంపేట ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బిర్సా ముండా చిత్రపటానికి కలెక్టర్ దినేష్ కుమార్ పూలమాల వేశారు.



12, 13, 14 తేదీల్లో తిరుపతిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభ

- పోస్టర్ ఆవిష్కరించిన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 25వ మహాసభలు తిరుపతిలో జరగనున్నాంది. డిసెంబరు 12, 13, 14 తేదీల్లో జరగనున్న ఈ మహాసభ పోస్టరును ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి రామ్మోహన్‌రావు, కె ప్రసన్నకుమార్ విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాసభల సందర్భంగా 12న తిరుపతిలో ర్యాలీ, బహిరంగ సభ ఇందిరా మైదానంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు, విద్యారంగ అభివృద్ధి కోసం పలు తీర్మానాలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. బకాయిలున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించి మెస్ ఛార్జీలను పెంచాలని కోరారు. గిరిజన విద్యార్థుల మరణాలు రోజురోజుకూ పెరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులు భర్తీ చేసి, మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన శాఖ మినహా అన్ని శాఖల పనులు చేస్తున్నారని, విద్యారంగాన్ని పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు కోసం ఆలోచించడం లేదని పేర్కొన్నారు. యూనివర్సిటీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, జూనియర్, డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో మెడికల్ కళాశాలల సీట్ల అమ్మకాన్ని వ్యతిరేకించి అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ వ్యక్తులకు కారుచౌకగా అమ్ముతున్నారని పేర్కొన్నారు. ఎయిడెడ్ కళాశాలలను పట్టించుకోవడం లేదన్నారు. రాజమండ్రి, కందుకూరు విద్యా సంస్థలను తిరిగి ప్రైవేటుపరం చేయాలని స్థానిక ఎమ్మెల్యే, ట్రస్ట్ ఇఒ చేస్తున్న ప్రయత్నాన్ని వ్యతిరేకించిన ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై కేసులు బనాయించారని, దీనికి వ్యతిరేకంగా పెద్దయెత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర మహాసభల్లో చర్చిస్తామని, తీర్మానాలు చేసి భవిష్యత్తు ప్రణాళికను రూపొందించి పని చేస్తామన్నారు. విద్యారంగ మేధావులు, ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకులు పాల్గొనే ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, నాయకులు ప్రణీత, షణ్ముఖ కుమార్ స్వామి, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్ద నిఘా ఏర్పాటు చేయండి

- పులివెందుల డిఎస్‌పిని కోరిన వైఎస్ సునీత

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

తన ఇంటి వద్ద నిఘా ఉంచాలని కోరుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి డిఎస్‌పి మురళీనాయక్‌ను కలిశారు. పులివెందుల డిఎస్‌పి కార్యాలయంలో శనివారం ఆయనతో వారు 40 నిమిషాలకు పాటు చర్చించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి చుట్టూ కొంతమంది ఆకతాయిలు తిరుగుతున్నారని తెలిపారు. ఈ మధ్య కాలంలో తమ భూమిని కొంతమంది ఆక్రమించారని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. వివేకా హత్య కేసు సంబంధించి నిందితుల బెయిల్ రద్దుపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్నందున వారి వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఇంటి వద్ద నిఘా ఉంచి ఆకతాయిల కదలికలను గమనించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న 9 మంది అరెస్టు

- గంజాయి, మాత్రలు స్వాధీనం : ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నగరంలోని రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి గంజాయి, మాత్రలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. కడప జిల్లా పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు... నగరంలోని డిటిసి సర్కిల్ వద్ద గంజాయి విక్రయిస్తున్న సురభి మహేష్, మరో ఎనిమిది మందిని రిమ్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.15 లక్షల విలువైన 23.580 కిలోల గంజాయిని, రూ.96 వేలు విలువచేసే మాత్రలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సురభి మహేష్‌పై రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కేసులు నమోదయ్యాయి. ఆయనకు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇంద్రజిత్‌తో పరిచయం ఉంది. గతంలో మహేష్ జైలు శిక్ష కూడా అనుభవించారు. ప్రస్తుతం ఈ కేసులో అరెస్టయిన కిరణ్ కుమార్, రహమతుల్లా, అబ్దుల్ రజాక్, మణికంఠ, అల్తాఫ్, నాగేంద్ర, మన్సూర్ ఖాన్, శివ ప్రశాంత్‌తో ఒక గ్యాంగ్ ఏర్పాటు చేసుకొని గంజాయి వ్యాపారం మొదలు పెట్టారు. దీంతో పాటు కర్నూలుకు చెందిన మెడికల్ షాప్ యజమాని నాగేంద్రతో చేతులు కలిపి మాత్రలు అమ్మేవారని, వచ్చిన లాభాలతో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారని ఎస్‌పి తెలిపారు. వీరిని పట్టుకున్న రిమ్స్ సిఐ బి రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, సిబ్బందిని ఆయన అభినందించారు.

సంపాదకీయం


పని 'హక్కు' కాదట!

పని హక్కు అనేది మనిషి గౌరవానికి, జీవనోపాధికి అవసరమైన ప్రాథమిక హక్కు. న్యాయమైన, సమాన పనికి సమాన వేతనం పొందే హక్కు ప్రతి మనిషికీ వుంది. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం లేని పని కోసం ఉపాధి హామీ పథకాల ద్వారా చట్టపరమైన పని హక్కు కల్పించబడుతోంది. అంతేకాదు, నిర్దిష్ట పనిగంటలు అమలు జరుగుతున్నాయి. దేశంలోని ప్రతి వ్యక్తీ సంపూర్ణంగా అభివృద్ధి సాధించడానికి కావాల్సిన కనీస సదుపాయాలే ప్రాథమిక హక్కులు. 'భారత ప్రజాస్వామ్యానికి పునాదిరాళ్లు ప్రాథమిక హక్కులు' అంటారు నానీ ఫాల్కీవాలా. పనిహక్కు అనేది ప్రజలకు ఉత్పాదక పనిలో పాల్గొనే ప్రాథమిక హక్కును సూచిస్తుంది. దీనిని 1948 ఐరాస మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనలో పొందుపరిచారు. భారత రాజ్యాంగం, ముఖ్యంగా ఆర్టికల్ 21, 41 ప్రకారం... జీవించే హక్కులో భాగంగా పనిచేసే హక్కుకు హామీ ఇస్తుంది. ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా స్వేచ్ఛ అసంభవం' అంటారు గాంధీజీ. కానీ, ఆర్థిక స్వాతంత్ర్యం... పని లేకుండా సాధ్యం కాదు. పని-కేవలం ఆదాయం సంపాదించే మార్గం మాత్రమే కాదు, అది ఒక వ్యక్తికి గౌరవం, సామాజిక భాగస్వామ్యం, ఆత్మగౌరవాన్ని కల్పించడం.

'జాతీయ కార్మిక విధానం 2025-2047 ముసాయిదా' కొద్ది రోజుల్లో అమలులోకి రానుంది. మూడు దశల్లో అంటే... 2025-27, 2027-37, 2037-47 లలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. తద్వారా దాదాపు 50 కోట్ల మంది శ్రామికులను ప్రభావితం చేస్తుందని అంచనా. జస్టిస్ గజేంద్ర గడ్కర్ నేతృత్వంలోని మొదటి కార్మిక సంఘం సిఫార్సుల మేరకు అనుసరిస్తున్న సామాజిక భద్రత, పారిశ్రామిక భద్రత, వేతనాల స్థిరీకరణ వంటి కార్మిక చట్టాలను ఈ విధానం అణచివేస్తుంది. 'ప్రభుత్వం గొప్పతనం, అది ప్రజలకు కల్పించే హక్కులపై ఆధారపడి వుంటుంది' అంటారు హెచ్.జె.లాస్కి. మోడీ ప్రభుత్వంలో అమలు చేయనున్న జాతీయ కార్మిక విధానం... కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పూర్తిగా మార్చివేసింది. కొత్త ప్రతిపాదన ప్రకారం, ఉపాధి ఇకపై ఒక కర్తవ్యం మాత్రమే, హక్కు కాదు. కొత్త విధానం పనిని ఒక హక్కుగా తొలగించి, దానిని ధర్మంగా, ఒక కర్తవ్యంగా, సేవగా మారుస్తున్నది. ఇది భారత రాజ్యాంగం యొక్క మౌలిక సిద్ధాంతాలను అణచివేయడమే. అంతేకాదు.. కార్మికులకు వ్యతిరేకంగా, యజమానులకు రక్షణగా కొత్త జాతీయ విధానం వుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. శతాబ్దాల పోరాటం ద్వారా సంక్రమించిన హక్కులు కోల్పోవడమే కాకుండా, బలహీనమైన కార్మికులను పూర్తిగా వీధిలోకి విసిరేస్తారు. రాజధర్మం పేరుతో కార్మిక హక్కులు త్యాగం చేయబడితే, ఆర్థికాభివృద్ధి ఒక వర్గానికే లాభిస్తుంది. దాతృత్వం, ఔదార్యం ముసుగులో హక్కులులేని బానిసలుగా శ్రామికులు మారతారు.

2024 లెక్కల ప్రకారం... భారతీయ శ్రామిక శక్తి దాదాపు 61 కోట్లు. ఈ విధానంతో దేశంలోని 50 కోట్లకు పైగా వున్న శ్రామికుల భవిష్యత్ ప్రమాదంలో పడింది. శ్రమను హక్కుగా కాక ధర్మంగా బోధించడం అంటే, అంబేద్కర్ స్వప్నించిన సమానత్వ రాజ్యాన్ని రద్దు చేయడమే. మనుస్మృతి ఆధారిత ఆలోచనలను శ్రమ న్యాయాలుగా మలచడం అంటే రాజ్యాంగాన్ని సవాలు చేయడమే. ఈ దేశంలో ప్రజాస్వామ్యం... హక్కుల పునాదిపైనే ఆధారపడి వుంది. పని హక్కుగా వుండాలి... దాతృత్వంగా కాదు. యువత భారతదేశం యొక్క గొప్ప సంపద. ప్రతి ఏడాదీ లక్షలాది యువతీ యువకులు ఉపాధి ఆశతో మార్కెట్‌లోకి అడుగుపెడుతున్నారు. ఇప్పటికే నిరుద్యోగం, ఉపాధిలేమి వారిని నిరాశ, నిస్పృహలలోకి నెట్టేస్తున్నది. శ్రమించేవారికి భద్రత ఇవ్వకుండా, దేశాభివృద్ధిని ఆశించడం స్వప్నమే తప్ప, వాస్తవం కాదు' అంటారు అమెరికన్ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కెయిన్స్. దేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే... ఉద్యోగాల కల్పన ప్రధాన లక్ష్యం కావాలి. కార్మికుల నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం, సామాజిక భద్రత కల్పించడం ద్వారా ఆర్థిక పురోగతికి దోహదపడాలి. అంతేతప్ప... ప్రజావ్యతిరేక విధానాలను తెచ్చి, కార్మికవర్గాన్ని, సామాజిక న్యాయాన్ని బలి చేయకూడదు.

మహనీయుల మాట



ఈ మట్టిలో పుట్టిన
ప్రతి మనిషికీ
ఆహార లభ్యత
కనీస హక్కు.
- నార్మన్ బోర్లాగ్,
ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త.

బీహార్ ఫలితాలు ఏం చెబుతున్నాయి?

ప్రస్తుతం



తెలకపల్లి రవి

బీహార్ ఎన్నికల్లో బిజెపి, జెడియు ఎన్‌డిఎ కూటమి అసాధారణ ఆధిక్యతతో అధికారం నిలబెట్టుకుంది. 2020 ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా దరిదాపులకు చేరడమేగాక 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆధిక్యతతో పట్టు ప్రదర్శించిన ఆర్.జె.డి, కాంగ్రెస్, వామపక్షాల మహాగట్బంధన్ (ఎం.జి.బి)కు దారుణమైన ఎదురుదెబ్బ తగిలింది. ఎన్.డి.ఎ విజయం గురించి అంచనాలు చెప్పిన ఏ ఎగ్జిట్ పోల్ కంటే కూడా ఊహించని స్థాయిలో అధికంగా సీట్లు వస్తే, ఎం.జి.బి కి ఏ ఒక్కరు చెప్పిన దానికన్నా తక్కువగా సీట్లు వచ్చాయి. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అనూహ్యమైన రీతిలో అయిదోసారి విజయం సాధించి పదోసారి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. నితీష్ ఈ ఇరవై ఏళ్లలో అయిదుసార్లు అటూ ఇటూ మారిన మాట అటుంచి తిరుగులేని నాయకుడుగా ఆవిర్భవించాడనే ప్రచారం నడుస్తున్నది. నితీష్ కుమార్ తన 'ఎక్స్'లో మోడీకి సాష్టాంగ ప్రణామం చేస్తున్నట్టు ట్వీట్ చేయడం కొసమెరుపు. గతంలోనూ మోడీకి పాదాభివందనాలు చేసిన నితీష్ ఈ విధంగా 'ఎక్స్'లోనూ సంచలనం సృష్టించారన్నమాట. ప్రధాని మోడీ బిజెపి కేంద్రంలో విజయోత్సవ ప్రసంగం చేస్తూ తమ తదుపరి టార్గెట్ బెంగాల్ కైవశం అని ప్రకటించారు. వ్యక్తిగతంగానూ, పార్టీ పరంగానూ అగ్ర స్థానాన వున్న రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్.జె.డి) నాయకుడు తేజస్వి యాదవ్ ఓట్ల పరంగా తన ప్రథమ స్థానాన్ని నిలబెట్టుకున్నా సీట్లలో గతంలో వచ్చిన దాంట్లో సగంకన్నా పడిపోయింది. ఆయనతో జత కట్టిన కాంగ్రెస్ ఎన్నడూ లేనంత తక్కువ స్థానాలు తెచ్చుకున్నది. అందరినీ గెలిపించే ఎన్నికల వ్యూహకర్త, బీహారీయుడు ప్రశాంత్ కిశోర్ స్థాపించిన 'జన్ సురాజ్ పార్టీ' ఖాతా తెరవలేకపోయింది. లౌకిక వామపక్ష శక్తులకు ఈ ఫలితాలు నిరుత్సాహం కలిగించం ఒకటైతే కాంగ్రెస్‌ను నిర్ఘాంతపరిచాయి. ఎన్నికల కమిషన్ 'సర్'కు తొలి రంగస్థలంగా మారిన బీహార్‌లో...ఆ విషయమై కేసు సుప్రీంలో తుది పరిష్కారం కాకుండానే...పోరాటం ముగిసిపోయింది. ఎన్నికల ప్రకటనకు ఆరు నెలల ముందే ఆపరేషన్ సిందూర్‌పై తొలి ప్రకటన బీహార్‌లో వెలువడగా తుది దశ పోలింగ్‌కు ముందు రోజే ఎర్రకోట ముందు కారు విస్ఫోటనం కలవరం సృష్టించింది.


ఆర్.జె.డి ఓట్ల శాతం ఎక్కువ వచ్చినా సీట్లలో దారుణంగా పడిపోయింది. దాని ఓటింగు పునాదిని మాత్రం నిలబెట్టుకుంది. కాంగ్రెస్ అతిగా అంచనా వేసుకుని రెండంకెలకు అసలు చేరుకోలేకపోయింది. కనుకనే బిజెపి ని ఓడించేందుకు ప్రతిపక్షాలు మరింత కలసికట్టుగా పనిచేయవలసిన అవసరాన్ని బీహార్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అందుకు భిన్నంగా బిజెపి సామదానభేద దండోపాయాలతో చిన్న పార్టీలను కూడా వదలకుండా కలుపుకోవడం దానికి రాజకీయంగా ఎంత మేలు చేస్తున్నదీ ఈ వివరాలు చెబుతాయి.

ఎం-వై జపం..మత రాజకీయం..

సమీక్షలు, విశ్లేషణలు ఏమైనప్పటికీ ఎన్నికల తీర్పును స్వీకరించి తగు పాఠాలు నేర్చుకోవడమే రాజకీయ పార్టీల, ప్రజల కర్తవ్యం. ఎన్నికల ప్రకటన ఇప్పుడో అప్పుడో అంటుండగా నితీష్ మహిళలకు పది వేల రూపాయల సహాయం అందించడం చాలా ప్రభావంగా చూపించడం సహజమే. దానికి ఎన్నికల సంఘం ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవడం కూడా విశేషమే (ఎందుకంటే తమిళనాడులో లోగడ కొన్ని పథకాలు చేయబోతే అనుమతి నిరాకరించిన ఉదాహరణ వుంది.). మద్య నిషేధం కారణంగానూ ఆయన మహిళా ఓటర్లలో సదభిప్రాయం పొందినట్టు కనిపిస్తుంది. నితీష్‌కు మహిళలు, తేజస్వికి యువత ఓట్లు వేస్తారని భావించారు. ముస్లిం యాదవ్ (ఎం-వై) అనే ఫార్ములాను మహిళ-యువగా మార్చి చూపారు. నిజానికి నిరుద్యోగం, వలస బతుకులు రెండు తరగతులపైనా తీవ్రంగానే ప్రభావం చూపుతాయిగానీ బీహార్ రాజకీయ కథనం అలా నడుస్తూ వచ్చింది. ఓట్ల పరంగా 'సర్', పథకాల పరంగా 10 వేల వ్యవహారం రెండూ ఎన్నికల నేపథ్యంలోనే జరిగాయి. పాకిస్తాన్‌తో ఘర్షణ, మతవాద ప్రచారం భారీ ఎత్తున సాగింది. అందులోనూ స్వయంగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా అందుకు బాధ్యత తీసుకున్నారు. వలసల నివారణ, పేదరికం, భూ సమస్యలు, అత్యాచారాలతో సహా ప్రజా సమస్యలపై ఎం.జి.బి చేసిన ప్రచారం వీటి చాటున కొట్టుకుపోయింది. కేంద్రంలో మోడీ, పక్కనే యు.పి లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం వుండగా ఉత్తరాదిన క్రమేణా హిందూత్వ రాజకీయాల పట్టు పెరుగుతున్నదనే నిజం కూడా బీహార్ ఫలితంలో ప్రతిబింబించింది. దానికి మరింత ఆజ్యం పోసేందుకు మజ్లిస్ రంగంలోకి దిగి ఆ ఓట్లు ఎం.జి.బి కి రాకుండా చేసింది. తనూ ఐదు స్థానాలు పొందింది. రెండు కూటములలోనూ చేరని పార్టీలు ఈ విధంగా పది శాతం వరకూ ఓట్లు తెచ్చుకోవడం ఫలితాన్ని చాలా ప్రభావితం చేసింది. వీటిలో కొన్ని పరోక్షంగా బిజెపి తో చేతులు కలిపాయి.

ఎం.జి.బి పొరబాట్లు

ఎం.జి.బి వైపు నుంచి చూస్తే సీట్ల సర్దుబాటుకు తుది ప్రకటనకు అంతులేని ఆలస్యం జరిగింది. ఇందుకు మూడు పార్టీలు బాధ్యత వహించవలసి వుంటుంది. నిజానికి 2020లో కాంగ్రెస్ 70 స్థానాలు తీసుకుని 19 మాత్రమే తెచ్చుకోపోవడం పరిస్థితిని తలకిందులు చేసింది. ఈసారి కూడా 60 వరకూ కావాలని ఆఖరు వరకూ పట్టు పట్టడమే గాక తేజస్విని కూటమి నాయకుడుగా ప్రకటించకుండా జాప్యం చేసింది. పూర్తి ఏకాభిప్రాయంతో ఎన్నికల ప్రచారం ఊపుగా సాగించడానికి కూడా ఇది ఆటంకమైంది. ఇదంతా రాహుల్ గాంధీ నాయకత్వంలో జరిగిందని చెప్పడం కాంగ్రెస్ ఏకైక వ్యూహం. రాహుల్ క్రియాశీలంగా మారడం మంచిదే



ఎవరికి ఎన్ని?	
బిజెపి	89
జెడియు	85
ఆర్‌జెడి	25
ఎల్‌జెపి	19
కాంగ్రెస్	6
మజ్లిస్	5
సిపిఐ ఎంఎల్	2
సిపిఐఎం	1
బిఎస్‌పి	1
ఇతరులు	10
మొత్తం	**243**

సమీక్షలు, విశ్లేషణలు ఏమైనప్పటికీ ఎన్నికల తీర్పును స్వీకరించి తగు పాఠాలు నేర్చుకోవడమే రాజకీయ పార్టీల, ప్రజల కర్తవ్యం. ఎన్నికల ప్రకటన ఇప్పుడో అప్పుడో అంటుండగా నితీష్ మహిళలకు పది వేల రూపాయల సహాయం అందించడం చాలా ప్రభావంగా చూపించడం సహజమే. దానికి ఎన్నికల సంఘం ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవడం కూడా విశేషమే (ఎందుకంటే తమిళనాడులో లోగడ కొన్ని పథకాలు చేయబోతే అనుమతి నిరాకరించిన ఉదాహరణ వుంది.). మద్య నిషేధం కారణంగానూ ఆయన మహిళా ఓటర్లలో సదభిప్రాయం పొందినట్టు కనిపిస్తుంది. నితీష్‌కు మహిళలు, తేజస్వికి యువత ఓట్లు వేస్తారని భావించారు. ముస్లిం యాదవ్ (ఎం-వై) అనే ఫార్ములాను మహిళ-యువగా మార్చి చూపారు. నిజానికి నిరుద్యోగం, వలస బతుకులు రెండు తరగతులపైనా తీవ్రంగానే ప్రభావం చూపుతాయిగానీ బీహార్ రాజకీయ కథనం అలా నడుస్తూ వచ్చింది.

అయినా ఆయన నినాదాలు, పద్ధతులు కొన్నిసార్లు ఇబ్బందిగానూ మారుతూ వచ్చాయి. ఓట్ చోరీ అంటూ మొదలుపెట్టిన ఆయన పోలింగ్ సమయంలోనే హర్యానా ఓటర్ల జాబితాతో సర్కార్ చోరీ నినాదం ఇచ్చారు. ఇది ముందే ఓటమిని ఒప్పుకోవడంగా బిజెపి ప్రచారం ఎత్తుకుంది. కాంగ్రెస్ వైఖరి కారణంగా ఇతర లౌకిక పార్టీలేవీ ఎం.జి.బి తరపున రంగంలోకి దిగి ప్రచారం చేసేందుకు సిద్ధం కాకపోవడానికి కూడా ఇది కారణమైంది. సిపిఐ(ఎంఎల్-లిబరేషన్) కూడా తన స్థానాలపై ఆంగీకరించడానికి చాలా సమయం పట్టింది. మొత్తం మీద ఎం.జి.బి మరింత ఏకోన్ముఖంగా, సమర్థంగా, సమిష్టిగా పోరాటంలోకి దిగవలసి వుండింది.

అవకాశవాదంతో సుశాసనం

ఇక చివరగా మోడీ, అమిత్‌షా లు బీహార్ ఎన్నికలను తీవ్ర సవాలుగా తీసుకుని అన్ని రకాల మతతత్వ పాచికలు ప్రయోగించారు. అభ్యంతరకరమైన అంశాలతో రెచ్చగొట్టేందుకు సిద్ధమైనారు. ఎన్నికల సంఘం ఏ దశలోనూ వాటిని ఆపడానికి ప్రయత్నించనే లేదు. నితీష్ కుమార్ కూడా పరోక్షంగా వాటికి వంత పాడుతూ వచ్చారు. 2024 ఎన్నికలకు ముందు ఎన్‌డిఎ నుంచి దూరం జరిగినట్టు కనిపించిన నితీష్ తర్వాత పూర్తిగా వారినే ఆశ్రయించుకున్నారు. దాంతో కార్పొరేట్ మీడియా ఆయనకు వంత పాడటం ప్రారంభించింది. ఆయన వయసునే సమస్యగా భావిస్తున్నట్టు చెబుతూ రాజకీయ లోపాలు కప్పిపుచ్చింది. సహజంగా అభిమానించే మహిళలు, ఇతర ఓటర్లు దాన్ని పెద్ద సమస్యగా పరిగణించకపోయి వుండొచ్చు. నిజానికి సుశాసన్ బాబుగా టముకు వేసుకున్న నితీష్ అంత సుశానుడేమీ కాదు. ఆయన హయాంలో వరుసగా 18 వంతెనలే కొట్టుకుపోయాయి. రాజకీయంగా సుస్థిర విధానం, లౌకిక ప్రజాస్వామ్య విధానాల పట్ల నిబద్ధత లేని ఒక నాయకుడు పాలనా పరంగా గొప్ప సమర్థత చూపడం సాధ్యమయ్యేది కాదు. మత రాజీకయాలు, కార్పొరేట్ దోపిడీ, సమాఖ్యపై దాడి వంటి ఏ అంశంలోనూ నితీష్ నిలబడింది లేదు. ఇన్నేళ్లు ముఖ్యమంత్రిగా వుండటమే గొప్పగా చెప్పడం తప్ప అందుకోసం ఎటుబడితే అటు దూకిన ఆయన అవకాశవాదాన్ని విస్మరించడం ఏం రాజకీయం? మోడీ పట్టులో వున్న కార్పొరేట్ మీడియా వాటిని పొరబాటున కూడా మాట్లాడలేదు. అందుకు బదులు ఎన్నికలు దగ్గరయ్యే కొద్దీ 'లాలూ ప్రసాద్ యాదవ్ జంగిల్ రాజ్, నితీష్ మంగళ్ రాజ్' అంటూ కొత్త పల్లవినే పతాక శీర్షికల్లో ఇస్తూ వచ్చింది. లాలూ హయాంలో తప్పులు, ఆరోపణలు ఎవరూ కాదనరు గాని ఇరవయ్యేళ్ల ఎన్‌డిఎ పాలన తర్వాత వాటినే చెప్పడం దేనికి? అప్పుడు జరిగినవన్నీ సరైనవని కాదు గానీ ఆ పేరుతో ఇప్పటి వ్యవహారాలనూ అవకాశవాదాలను కప్పిపుచ్చడం మాత్రం సంఘపరివార్ వ్యూహంలో భాగం.

కూటముల తేడా

2020తో పోలిస్తే 2025లో బీహార్ ఎన్నికల గణాంకాలు అనేక సత్యాలు చెబుతున్నాయి. అప్పట్లో ఎన్.డి.ఎ, ఎం.జి.బి లకు 37.6, 36.58 శాతం ఓట్లు వచ్చాయి. అంటే కేవలం 0.03 శాతం ఓట్ల తేడాతో మూడు సీట్ల ఆధిక్యతతో అధికారానికి రాగలిగింది. అప్పుడు ఆర్.జె.డి ఎం.జి.బి 110 స్థానాలు తెచ్చుకుంది. 75 స్థానాలతో ఆర్.జె.డి ఏకైక పెద్ద పార్టీగా రాగా 74 సీట్లతో బిజెపి రెండో స్థానం పొందింది. ఈ సారి ఎన్.డి.ఎ 46.6 శాతం ఓట్లు తెచ్చుకుంటే ఎం.జి.బి 37.9 శాతం ఓట్లు పొందింది. అంటే తేడా పది శాతంపైనే వుంది. కానీ సీట్ల తేడా చాలా పెరిగింది. 202 సీట్లు ఎన్.డి.ఎ కు వస్తే ఎం.జి.బి కి 35 మాత్రమే వచ్చాయి. గతసారి ఒంటరిగా 30 చోట్ల పోటీ చేసి 5.7 శాతం ఓట్లు తెచ్చుకుని జె.డి.యు కు నష్టం కలిగించిన ఎల్‌జెపి మళ్లీ అటే చేరింది. గతంలో మజ్లిస్‌తో కలసి పోటీ చేసిన ఉపేంద్ర కుశ్వాహ 'రాష్ట్రీయ లోక్ మోర్చా' (ఆర్.ఎల్.ఎం), జితన్‌రాం మాంఝీ హెచ్.ఎ.ఎం కూడా ఇటే కలిశాయి. అటు నుంచి ఇటు వచ్చిన వికాశ్ శీల్ పార్టీకి సంబంధించిన 1.5 శాతం ఓట్లు తగ్గినా పైకారణాల వల్ల ఎన్.డి.ఎ ఓట్లు పెరిగాయి. మొత్తంపైన 2020లో ఎం.జి.బి వ్యతిరేక ఓట్లు ఎక్కువగా చీలిపోతే ఇప్పుడు అవే కలిశాయి. 2020లో 65 సీట్లలో ప్రత్యర్థుల ఓట్ల చీలిక వల్ల ఎంజిబి గెలిచింది. ఇది ఎక్కువగా జె.డి(యు) కి నష్టం చేసింది. 2020లో 61 సీట్లలో ఆ రెండు ప్రధాన పార్టీలు పోటీ పడితే 40 ఆర్.జె.డి, 21 జె.డి.యు గెలిచాయి. ఇప్పుడు 59 చోట్ల ఈ రెండూ తలపడితే 50 జెడియు 9 మాత్రమే ఆర్.జె.డి గెలిచాయి. ఈ కారణంగానే ఆర్.జె.డి ఓట్ల శాతం ఎక్కువ వచ్చినా సీట్లలో దారుణంగా పడిపోయింది. దాని ఓటింగు పునాదిని మాత్రం నిలబెట్టుకుంది. కాంగ్రెస్ అతిగా అంచనా వేసుకుని రెండంకెలకు అసలు చేరుకోలేకపోయింది. కనుకనే బిజెపి ని ఓడించేందుకు ప్రతిపక్షాలు మరింత కలసికట్టుగా పనిచేయవలసిన అవసరాన్ని బీహార్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. అందుకు భిన్నంగా బిజెపి సామదానభేద దండోపాయాలతో చిన్న పార్టీలను కూడా వదలకుండా కలుపుకోవడం దానికి రాజకీయంగా ఎంత మేలు చేస్తున్నదీ ఈ వివరాలు చెబుతాయి.

పోరాడాల్సిందే

సహజంగానే ఈ ఫలితాల తర్వాత 'సర్'పై పోరాటం వృథా కావడమేగాక తప్పుగా తేలిపోయిందని కొందరు వాదిస్తున్నారు. కాని సక్రమమైన ఎన్నికల నిర్వహణ, నిష్పాక్షికత ప్రజాస్వామ్యంలో మూల సూత్రం. సుప్రీం కోర్టులోనూ రాజకీయంగానూ ఆ పోరాటం తీవ్రం చేయడం అవసరం. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలోనూ 'సర్' సన్నాహాలు మొదలైనాయి. జూబ్లీహిల్స్‌తో సహా ఉప ఎన్నికలను చూస్తే బిజెపి ఏకపక్షంగా గెలిచిందేమీ లేదు. పైగా అక్కడ డిపాజిట్ కూడా కోల్పోయింది. కనుక లౌకిక వ్యవస్థ పరిరక్షణ కోసం ప్రతిపక్షాల రాజ్యాంగ సంస్థలనూ వ్యవస్థలనూ దుర్వినియోగం చేస్తున్న తీరుపై తప్పక సమైక్యంగా పోరాడవలసిందే. నిజానికి బీహార్ ఫలితం ఆ అవసరాన్ని మరింత పెంచడమేగాక మరింతగా హెచ్చరిక చేస్తుంది. ★

కథలు చదవని మనుషులు

విశ్లేషణ

సి.వి. కృష్ణయ్య

అవి నా చిన్నప్పటి రోజులు. నేను ఐదో తరగతి చదువుతున్నాను. మా ఇంటి పక్కన ఒక పెద్దమనిషి ఉండేవాడు. ఆయన్ను అందరూ "కథల బాబాయ్" అని పిలిచేవారు. పిల్లల్ని చుట్టూ కూర్చుండబెట్టుకొని కథలు చెబుతూ ఉండేవాడు. చెప్పిన కథ చెప్పకుండా చెపుతూ ఉంటే ఎంతో ఆసక్తిగా వినేవాళ్లం. కథలో ఉండే విషయం కన్నా ఆయన చెప్పే తీరుకు మేము ఎక్కువ ఆకర్షితులమయ్యాం అని చెప్పవచ్చు. అప్పుడప్పుడు మాకు ఒక విషయం చెప్పేవాడు. 'మీరు పాఠాలు చదవకపోయినా పర్వాలేదు. కథలు మాత్రం తప్పక చదవండి. కథలు చదివినవాళ్లు మంచి మనుషులు అవుతారు' అని చెప్పేవాడు.

నేను పదవ తరగతిలో ఉండగా కథల బాబాయ్ ఏదో జబ్బుతో కన్నుమూశాడు. ఊరి జనమంతా కన్నీరు మున్నీరై విలపించారు. మన పిల్లలకూ మనకూ ఇంక ఎవరు కథలు చెబుతారంటూ దిగులు పడ్డారు.

ఆ చిన్న వయస్సులో కథలు వింటూ పెరిగిన నేను కథల పుస్తకాలు తెగ చదివేవాడిని. క్రమక్రమంగా నవలలు, పురాణాలు శాస్త్ర గ్రంథాలు చదవడం అలవాటయింది. 50 సంవత్సరాల కిందట కథల బాబాయ్ చెప్పిన మాటలు అప్పుడప్పుడు గుర్తుకు వస్తూ ఉంటాయి. కథలు చదవకుండా పుస్తకాలు చదవకుండా డిగ్రీలు సంపాదించుకొని బయటకు వస్తున్న వీళ్లంతా మంచివాళ్లు కాదా? ఏమో ఆనాడు కథల బాబాయ్ చెప్పిన మాటలు నిజమేమో అనిపిస్తూ ఉంది.

కథల్లో ఏముంది? కథా సాహిత్యం మనుషుల్ని ఇంతగా ఎందుకు ఆకర్షిస్తుంది? కథ కూడా అద్దం లాంటిదే. మనిషి అద్దంలో తన ముఖం చూసుకొన్నట్లు కథలో తనను వెదుక్కొంటాడు. తన అభిప్రాయాలు, బాధలు, మంచీచెడుల గురించి తెలుసుకొంటూ వుంటాడు. కథల్లో, కావ్యాల్లో, నవలల్లో అన్నింటిలో మనుషులే ఉంటారు. కథల్లో ఇతర జీవులు, ప్రాణంలేని బండరాళ్లు మనిషిలానే మాట్లాడతాయి. అణువణువులో మనిషి తననే వెదుక్కొంటాడు.

పుస్తకాలు చదివేవాళ్లు వంద మంది ఉన్నారనుకొంటే అందులో తొంభై మంది కథల పుస్తకాలే చదువుతుంటారు. మిగిలిన పది శాతం ఇతర పుస్తకాలు చదువుతుంటారు.

కథలు చదివేవాళ్లు జాతి, కుల, మత భేదాలు లేకుండా ఒకేలా స్పందిస్తారు. అందరూ సినిమాలకు వెళతారు. సినిమా చూసే ప్రేక్షకుల్లో ధనికులూ, పేదలూ ఉంటారు. మంచివారూ, చెడ్డవాళ్లు ఉంటారు. అందరూ ఒకేలా స్పందిస్తూ ఉంటారు. ముగింపులో చెడు ఓడిపోయి మంచి గెలుస్తుంది. ఎవ్వరూ చెడు గెలవాలని కోరుకోరు. కాని నిజ జీవితంలో బలహీనుడి వైపు ఎంత న్యాయమున్నా గెలవడు. బలవంతులు, ధనవంతులు, అధికారం ఉన్నవాళ్లు ఈ ప్రపంచంలో గెలుస్తూ ఉన్నారు. కాని కథల్లో మాత్రం ఓడిపోవాల్సిందే. ఇది మానవ జాతి ఆకాంక్ష, కోరిక, ఆశయం. ఈ ఆకాంక్షను మానవజాతి ఏదో ఒక రోజు నెరవేర్చుకొంటుంది. అయితే మనుషులు ఈ ఆకాంక్షతో జీవించాలంటే అది కథా సాహిత్యం ద్వారానే సాధ్యం. మరింత బలంగా పురికొల్పబడుతూ ఉండాలి. ఇందుకే పిల్లలు కథలు వింటూ కథలు చదువుతూ పెరగాలి.

కథా సాహిత్యం చదవకుండా పాఠ్యేతర పుస్తకాలు చదవకుండా పైకి వచ్చిన వారికి మనుషులు మనుషుల్లా కనిపించరు. డాక్టర్లకు పేషంట్లుగా, లాయర్లకు క్లయింట్లుగా, రాజకీయ నాయకులకు ఓటర్లుగా, వ్యాపారులకు కష్టమర్లుగా మాత్రమే కన్పిస్తారు. వీళ్లంతా ప్రకృతి నుండి, మనిషి నుండి ఎంత పిండుకోవాలో అంత పిండుకోడానికే చూస్తారు.

మానవ జాతిని సమాజ అభివృద్ధిని శాస్త్రీయంగా అర్థం చేసుకోకపోతే, తాలిబన్ల వంటి ఉగ్రవాదులు పుడుతూనే ఉంటారు. ప్రకృతిని ఇతర జీవజాతులను అర్థం చేసుకోలేకపోతే కరోనా లాంటి భూతాలు పుడుతూనే ఉంటాయి. అంతులేని లాభాపేక్షతో వ్యాపారులు, ఆశబోతులు ప్రకృతి నుండి మరింత పిండుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటే కరోనా కంటే ప్రమాదకరమైన జీవులు పుట్టి మానవజాతి అంతుచూస్తాయి.

మనిషి గుండెల్ని తట్టి లేపేవి పుస్తకాలు. పుస్తకాలు మనతో మాట్లాడతాయి. పుస్తకానికి పాఠకుడికి మధ్య ఎవ్వరూ ఉండరు. ఏకాంతంలో పుస్తకాలు చదువుతూ స్పందిస్తూ ఉన్నప్పుడే మనిషిలో మార్పు జరుగుతూ ఉంటుంది. మంచి భావనలు నాటుకొంటూ ఉంటాయి. ఇక్కడ పరీక్షలు, మార్కుల గొడవ ఉండదు. గుర్తుపెట్టుకోవాలనే బాధ ఉండదు. ఇష్టపూర్వకంగా ఆనందంగా ఆసక్తిగా చదివే పుస్తకాలే మనిషిని మానవతా సింహాసనంపై కూర్చుండబెడతాయి. మహనీయులుగా మారుస్తాయి.

ఈ భూగోళం పచ్చగా పరిశుభ్రంగా జీవంతో కళకళలాడుతూ ఉండాలంటే మనిషి మారాలి. మనుషులు మంచి వాళ్లుగా ఆలోచనాపరులుగా మారాలి. ఇది ఒక్క కథాసాహిత్యం ద్వారానే సాధ్యం.

మనుషుల ఊహలకు, కల్పనలకు, ఆకాంక్షలకు ఊపిరి పోసేవే కథలు. కథల్లో ఉన్న కల్పనలు-శాస్త్ర సాంకేతిక విజ్ఞాన శాస్త్రాల ద్వారా వాస్తవం చేసుకొంటాడు మనిషి. ఊహలకు, కల్పనలకు ఊపిరి పోసే కథలు చదవకుండా మన విద్యార్థులకు శాస్త్రజ్ఞానం ఎలా అబ్బుతుంది? శాస్త్రజ్ఞులకు మానవతా విలువలు ఎక్కడ నుండి వస్తాయి?

మనిషి కథల గుర్రాన్ని ఎక్కి స్వారీ చేసుకొంటూ సైన్సు అనే మాయా మందిరంలోకి ప్రవేశించాలి. అప్పుడు మాత్రమే తన మానవ రూపాన్ని నిలబెట్టుకొంటాడు. లేకపోతే ఏ భూతంగానో క్రూర మృగంగానో మారిపోయి బయటకు వస్తాడు.


ఒకప్పుడు శాస్త్రాన్ని కూడా కలిపి అంతా సాహిత్యంగానే చదువుకొన్నారు. ఆధునిక కాలంలో శాస్త్రం సాహిత్యం నుండి విడగొట్టుకొన్నది. అయినా చదువుల్లో భాషా సాహిత్యాలకు, విజ్ఞాన శాస్త్రాలకు సమప్రాధాన్యతనిచ్చి చదువుకొన్నాం. ఇప్పుడు భాషా సాహిత్యాలను పక్కనబెట్టి శాస్త్రజ్ఞానం చాలు అన్నట్లుగా చదువులు సాగుతున్నాయి. ఈ చదువుల పుణ్యమే మాతృభాషల ప్రాధాన్యతలను అర్థంచేసుకోలేని మేధావులు తయారయ్యారు. ఊహలు, కల్పనలు, స్పందనలు లేని కొత్తరకపు మానవజాతి ఈ భూగోళం మీద అవతరిస్తుంది.

ఈ కొత్త రకపు మానవజాతి పుట్టింది ఈ చదువుల ద్వారా ఈ బడుల ద్వారానే. ఇది నమ్మలేని నిజం.

బాల్యంలో కథా సాహిత్యం చదవకపోవడం, పాఠ్యేతర పుస్తకాలు చదవకపోవడమనే చిన్న కారణంతో బడిమీద, ఈ నాటి చదువుల మీద ఇంత పెద్ద నిందవేయడం సబబేనా?

చిన్న మేకు టైరులో దిగితే గాలిపోయి బండి బోల్తా కొడుతుంది. బోల్టు చాలా చిన్నగా కనిపించవచ్చు. అది ఊడిపోతే ఎంత పెద్ద యంత్రమైనా ఆగిపోతుంది.

కథలు చదవకపోవడం పుస్తకాలు చదవకపోవడం చిన్న కారణమా? మనిషి గుండెల్ని తట్టి లేపేవి పుస్తకాలు. పుస్తకాలు మనతో మాట్లాడతాయి. పుస్తకానికి పాఠకుడికి మధ్య ఎవ్వరూ ఉండరు. ఏకాంతంలో పుస్తకాలు చదువుతూ స్పందిస్తూ ఉన్నప్పుడే మనిషిలో మార్పు జరుగుతూ



ఉంటుంది. మంచి భావనలు నాటుకొంటూ ఉంటాయి. ఇక్కడ పరీక్షలు, మార్కుల గొడవ ఉండదు. గుర్తుపెట్టుకోవాలనే బాధ ఉండదు. ఇష్టపూర్వకంగా ఆనందంగా ఆసక్తిగా చదివే పుస్తకాలే మనిషిని మానవతా సింహాసనంపై కూర్చుండబెడతాయి. మహనీయులుగా మారుస్తాయి.

'మానవుడు సృష్టించిన వాటిలో గొప్పది ఏది అని అడిగితే ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా పుస్తకం అని చెబుతాను' అన్నాడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. 'తుపాకీ కంటే గొప్ప ఆయుధం పుస్తకం' అన్నాడు లెనిన్. 'శారీరక ఆరోగ్యానికి వ్యాయామం ఎలా అవసరమో మానసిక ఆరోగ్యానికి పుస్తక పఠనం అంతే అవసరం' అన్నాడు మానసిక శాస్త్రవేత్త సిగ్మండ్ ఫ్రాయిడ్. 'నాకు కోటి రూపాయిలిస్తే ముందు గ్రంథాలయాన్ని పెడతాన'న్నాడు గాంధి. 'ఒక పిల్లవాడికి మీరు ఇవ్వాల్సిన గొప్ప బహుమతి పుస్తకమే'నంటాడు విన్‌స్టన్ రస్సెల్.

ప్రపంచాన్ని తిరిగి చూడాలన్నా, భూత భవిష్యత్తు కాలాల్ని దర్శించాలనుకొన్నా ముందు గ్రంథాలయమనే జ్ఞాన మందిరాన్ని సందర్శించాలి.

/ 'జనవిజ్ఞానం' సౌజన్యంతో /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

తుది ఎస్ఐఆర్ తర్వాత 3 లక్షల మంది ఓటర్లు చేరారు

• కాంగ్రెస్ పోస్టుపై స్పందించిన ఇసి

న్యూఢిల్లీ : సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) జరిగి, తుది జాబితా ప్రచురితమైన తర్వాత బీహార్ ఓటర్ల జాబితాలో మరో మూడు లక్షలమంది ఓటర్లు చేరారని ఎన్నికల కమిషన్ అధికారులు శనివారం తెలిపారు. కాంగ్రెస్ పెట్టిన సోషల్ మీడియా పోస్టుకు వారు స్పందించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన సమయంలో ఇసి, ఓటర్ల సంఖ్యను 7.42 కోట్లుగా ప్రకటించింది. కానీ తర్వాత చేసిన ప్రకటనల్లో ఆ సంఖ్య 7.45 కోట్లకు చేరిందని కాంగ్రెస్ ఆ పోస్టులో పేర్కొంది. దీనిపై స్పందించిన ఇసి అధికారులు, సెప్టెంబరు 30న ప్రచురితమైన తుది ఓటర్ల జాబితా ప్రాతిపదికన అక్టోబరు 6న చేసిన ప్రకటనలో 7.42 కోట్లుగా పేర్కొన్నట్టు చెప్పారు. అయితే ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత ప్రతి దశ పోలింగ్‌లోనూ నామినేషన్ల దాఖలు చేసే చివరి తేదికి పది రోజుల ముందువరకు అర్హులైన పౌరుడు తమ పేరును చేర్చుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల నిబంధనలు పేర్కొంటున్నాయని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అందువల్ల అక్టోబరు 1 నుండి రెండు దశల్లో నామినేషన్ల చివరి తేదికి 10 రోజుల ముందువరకు వచ్చిన, చెల్లుబాటైన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లను చేర్చామని అధికారులు వివరించారు. అలా చేసిన ఓటర్ల సంఖ్య దాదాపు మూడు లక్షల వరకు వుందొచ్చునని చెప్పారు. ఓటింగ్ ముగిసిన అనంతరం విడుదల చేసిన పత్రికా సమావేశంలో ఇసి సవరించిన ఈ ఓటర్ల సంఖ్యను ప్రస్తావించిందని ఇసి అధికారులు తెలిపారు.

రాజకీయాల నుంచి వైదొలిగిన లాలూ కుమార్తె

పాట్నా : బీహార్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జెడి) అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆమె సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. 'నేను రాజకీయాల నుంచి వైదొలుగుతున్నాను. నా కుటుంబంతో కూడా సంబంధాలు తెంచుకుంటున్నాను. సంజయ్ యాదవ్, రమీజ్ అలామ్ ఇచ్చిన సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకుంటున్నాను. అన్ని విమర్శలకు నేను బాధ్యత వహిస్తాను'' అని ఆమె పేర్కొన్నారు. రోహిణీ.. బీహార్ మాజీ ముఖ్యమంత్రులు లాలూప్రసాద్, రబ్రీ దేవీల నాలుగో సంతానం. ఆమె వత్తిరీత్యా వైద్యురాలు. లాలూ స్నేహితుడు, రిటైర్డ్ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి అయిన రాయ్ రణవిజయసింగ్ కుమారుడు సమరేశ్ సింగ్‌ను ఆమె వివాహం చేసుకొని సింగపూర్‌లో స్థిరపడ్డారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే రోహిణి రాజకీయ ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలు విసురుతుంటారు. అనారోగ్యంతో బాధ పడుతున్న తండ్రికి తన కిడ్నీల్లో ఒకదానిని దానం చేసి తండ్రిపై తనకున్న ప్రేమను చాటుకొని విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. 2024లో తమ కుటుంబానికి కంచుకోట అయిన సరన్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు.

నేడు తెరుచుకోనున్న శబరిమల ఆలయం

• సోమవారం నుంచి యాత్రికులకు అనుమతి

తిరువనంతపురం : కేరళలోని ప్రసిద్ధ అధ్యాత్మిక క్షేత్రం శబరిమల అయ్యప్ప ఆలయాన్ని మండల-మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్‌లో భాగంగా ఆదివారం సాయంత్రం 5 గంటలకు తెరవనున్నారు. ప్రధాన అర్చకుడు కందరారు మహేశ్ నమ్బూద్రి తలుపులు తెరుస్తారు. ఆలయ ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి ప్రారంభ పూజ నిర్వహించిన అనంతరం శ్రీకోవిల్ (గర్భగుడి) నుంచి తీసుకువచ్చిన జ్వాలను ఉపయోగించి 18 మెట్ల వద్ద అగ్ని (పవిత్ర మంట)ను వెలిగిస్తారు. అయితే ఆదివారమే ఆలయాన్ని తెరిచినప్పటికీ వృశ్చిక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు అధికారిక ఆచారాలు, కొత్త పూజారులు బాధ్యతలు తెరవడంతో తీర్థయాత్ర సీజన్ ప్రారంభమవుతుంది. ఆ రోజు నుంచి యాత్రికులను అయ్యప్ప దర్శనం కోసం అనుమతిస్తారు. ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకున్న భక్తులను ప్రతిరోజూ 70 వేల మందిని దర్శనానికి అనుమతిస్తారు. పంబ, నీలక్కల్, ఎరుమేలి, వండిపెరియార్ సత్రం, చెంగన్నూరులలో స్పాట్ బుకింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అయితే అయ్యప్ప దర్శనానికి ఆన్‌లైన్ బుకింగ్ తప్పనిసరి. ఇందుకోసం sabarimalaonline.org నుంచి కూడా యాత్రికులు బుక్ చేసుకోవచ్చు. మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్‌కు సంబంధించి యాత్రికులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ట్రావెన్ కోర్ దేవస్వం బోర్డు (టిబిడి) ఇప్పటికే పూర్తి చేసింది.

సదరం స్లాట్ కోసం నిరీక్షణ

• రెండు రోజులైనా ప్రారంభం కాని వైనం • ఇబ్బందులు పడుతున్న వికలాంగులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

శారీరక, మానసిక లోపాలు ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వం వారికి ప్రత్యేకంగా పెన్షన్లు మంజూరు చేస్తోంది. దీని కోసం సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. ఈ సర్టిఫికెట్ కోసం అభ్యర్థులు ముందుగా స్లాట్‌ను బుక్ చేసుకోవాల్సి ఉంది. అయితే, సాంకేతికలోపం కారణంగా రెండు రోజులుగా సదరం క్యాంపులకు స్లాట్లు బుక్ కావట్లేదు. ఈ నెల 14 నుంచి స్లాట్ల బుకింగ్ పునఃప్రారంభమవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ ప్రక్రియ డిసెంబర్ నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు. అయితే, శనివారం సాయంత్రం వరకు స్లాట్ల బుకింగ్ ప్రారంభం కాలేదు. దీంతో, వికలాంగులు ఎన్నో వ్యయప్రయాసలోర్చి మీ సేవ కార్యాలయాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అసలే వికలాంగులు మరో వ్యక్తి తోడు ఉంటేగానీ బయటకు వెళ్లలేని దీన స్థితి. అయినా పెన్షన్ కోసం వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులు పూర్తవుతున్నా ఇంకా ప్రారంభం కాకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బిఎంసి ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ : కాంగ్రెస్

ముంబయి : బృహన్ ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగనున్నట్టు కాంగ్రెస్ ప్రకటించింది. మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ)లో తలెత్తనున్న ఒత్తిడి నేపథ్యంలో.. రానున్న బిఎంసి ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయడానికి పార్టీ సిద్ధమవుతోందని కాంగ్రెస్ నేత వర్షగైక్వాడ్ ప్రకటించారు. శనివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆమె ఈ ప్రకటన చేశారు. కాంగ్రెస్ కార్పోరేటర్ల ఎన్నికను తామే నిర్ధారించుకోవాలని, మొత్తం 227 స్థానాలకు సిద్ధం కావాలని పార్టీ కార్యకర్తలకు తెలిపారు. బిఎంసిలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని పార్టీ కార్యకర్తలు బలంగా నిర్ణయించుకోవాలని పిలుపునిచ్చారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి రమేష్ చెన్నితల, మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు హర్షవర్ధన్ సహా సీనియర్ నేతల సమక్షంలో ఆమె ఈ ప్రకటన చేశారు. శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్‌ఠాకరే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) నేత రాజ్‌ఠాకరేలు బిఎంసి ఎన్నికల్లో కలిసి పోటీ చేసే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ ఈనిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఉత్తర భారత్ నుండి వచ్చిన వలసదారులపై రాజ్‌ఠాకరే దూకుడుగా వ్యవహరిస్తుండటంతో.. కాంగ్రెస్‌లోని ఒక వర్గం ఎంవిఎలో చేరేందుకు అయిష్టత వ్యక్తం చేస్తోంది. బిఎంసికి వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నాం

• సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విన్‌గ్రూప్ హెడ్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు విన్‌గ్రూప్ ముందుకొచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎంను విన్‌గ్రూప్ ఆసియా సిఇఒ ఫామ్ సాన్ చౌ మర్యాదపూర్వకంగా కలిశారు. తుగ్లక్ రోడ్‌లోని సిఎం అధికారిక నివాసంలో జరిగిన ఈ భేటీలో... తెలంగాణ రాష్ట్రంలో కీలక ప్రాజెక్టులను స్థాపించడానికి ఫామ్ సాన్ చౌ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ వెహికల్ (ఇవి) తయారీ యూనిట్లు, బ్యాటరీ నిల్వ సౌకర్యాలను ఏర్పాటు చేయాలనే ఆసక్తిని సిఎంకు వివరించారు. హైదరాబాద్ నగరం సమీపంలో ప్రభుత్వ ప్రతిపాదిత భారత్ ఫ్యూచర్ సిటీపై విన్‌గ్రూప్ ఆసియా సిఇఒ ఫామ్ సాన్ చౌ ప్రత్యేక ఆసక్తిని చూపించారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటు పట్ల సీఎం దార్శనికతను ఆయన అభినందించారు. అక్కడ అభివృద్ధిలో పెట్టుబడి పెట్టడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 8, 9 తేదీలలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి.. ఫామ్ సాన్ చౌతోపాటు విన్‌గ్రూప్ చైర్మెన్ ఫామ్ నాట్ వూంగ్‌లను ఆహ్వానించారు. ఈ సమావేశంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, సెక్రెటరీ కోఆర్డినేషన్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



గాజా శాంతి ప్రణాళికపై
17న భద్రతా మండలిలో ఓటింగ్

ఐక్యరాజ్య సమితి : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించడంతో అమలవుతున్న గాజా శాంతి ప్రణాళికను ధ్రువీకరిస్తున్న తీర్మానంపై ఈ నెల 17న ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో ఓటింగ్ జరగనుంది. గాజాలో రెండేళ్లుగా సాగిన యుద్ధానికి ముగింపు పలుకుతూ ట్రంప్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ప్రణాళికను మండలి ధ్రువీకరించేందుకై గత వారం మండలి పరిధిలోని 15 సభ్య దేశాల మధ్య అమెరికా అధికారికంగా చర్చలు ప్రారంభించింది. ఈ మేరకు ముసాయిదా తీర్మానం ప్రతి ఒకటి గురువారం మీడియా చేతికి అందింది. గాజాలో తాత్కాలిక పాలనా సంస్థను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఆ ముసాయిదా పేర్కొంటోంది. గాజా స్ట్రిప్‌ను నిస్సైనికీకరణ చేసేందుకు, సరిహద్దు ప్రాంతాలను సురక్షితంగా వుంచేందుకు కొత్తగా శిక్షణ పొందే పాలస్తీనా పోలీసులతో, ఈజిప్ట్, ఇజ్రాయిల్‌తో కలిసి పనిచేసేందుకు 'తాత్కాలిక అంతర్జాతీయ స్థిరీకరణ శక్తి (ఐఎస్ఎఫ్)'ని ఏర్పాటు చేసేందుకు సభ్య దేశాలకు ఈ తీర్మానం అధికారమిస్తుంది. భద్రతా మండలి త్వరితంగా ఈ తీర్మానాన్ని ఆమోదించాలని శుక్రవారం అమెరికా, పలు అరబ్ ముస్లిం దేశాలు కోరాయి. ప్రస్తుత పరిస్థితులలో వున్న భద్రతా మండలి తీర్మానానికి తామందరి సంయుక్త మద్దతు వుంటుందని అమెరికా, కతార్, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ, ఇండోనేషియా, పాకిస్తాన్, జోర్డాన్, టర్కీలు ఒక సంయుక్త ప్రకటనలో కోరాయి. గాజాలో అంతర్జాతీయ బలగాలను మోహరించరాదని లేదా తాత్కాలిక పాలనా బోర్డును ఏర్పాటు చేయడానికి అధికారమివ్వరాదని మండలి సభ్య దేశాలను కోరుతూ రష్యా పోటీగా ఒక ముసాయిదా తీర్మానాన్ని పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పై దేశాలన్నీ సంయుక్త ప్రకటన వెలువరించాయి.

బోగస్ బిల్లు... ఖజానాకు చిల్లు

కార్పొరేషన్ డీజిల్ బిల్లుల్లో అక్రమాలు
నిధుల గోల్‌మాల్‌లో వర్క్ఇన్‌స్పెక్టర్ల చేతివాటం?
ఉన్నతాధికారి విచారణలో వెలుగులోకి అక్రమాలు!
అవినీతి గుట్టుపై విచారణ

ప్రజాశక్తి- అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగంలో డీజిల్ బిల్లులు, సివిల్ వర్క్స్ అంచనాల తయారీలో బోగస్ బిల్లుల వ్యవహారం పెద్ద దుమారాన్ని రేపుతోంది. బోగస్ బిల్లులు, అంచనాలతో కార్పొరేషన్ ఖజానాకు గండి కొట్టిన వ్యవహారం ఉన్నతాధికారి తనిఖీల్లో ఇటీవల వెలుగు చూసింది. ఈ అవినీతి వ్యవహారంపై ఉన్నతాధికారి విస్మయం వ్యక్తం చేయడంతో పాటు సమగ్ర విచారణ చేసి వాస్తవాలు బయటపెట్టే పనిలో ఉన్నట్లు తెలిసింది.అనంతపురం కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేకించి ఇద్దరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పరిధిలో దొంగ బిల్లులు తయారు కావడం గమనార్హం. ఈ అంచనాల తయారీలో ఇద్దరు వర్క్ ఇన్స్పెక్టర్ల ప్రమేయం ఉన్నట్లు ఉన్నతాధికారి తనిఖీలో వెలుగు చూసింది. ఒక డిఇ పరిధిలో 20 డీజిల్ బిల్లులు బోగస్ ఉన్నట్లు తెలుస్తోంది. బోగస్ డీజిల్ బిల్లులు తయారు చేయడంలో సిద్ధహస్తునిగా ఆ వర్క్ ఇన్స్పెక్టర్ పేరు కార్పొరేషన్‌లో ప్రచారంలో ఉంది. బోగస్ డీజిల్ బిల్లులు వ్యవహారంలో లక్షలాది రూపాయల గోల్మాల్ ప్రతినెలా సాగుతున్నట్లు ఆరోపణ ఉన్నాయి. గతంలో కన్నా అద్దె ట్రాక్టర్లు వినియోగంలోకి వచ్చిన తర్వాత డీజిల్ బిల్లులు రెట్టింపు అవడం ఈ ఆరోపణకు బలం చేకూరుస్తోంది. వాస్తవంగానే డీజిల్ ఖర్చు అవుతోందా.. లేక బోగస్ బిల్లులు సృష్టించి ఖజానాకు కన్నం వేస్తున్నారా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. డీజిల్ బోగస్ బిల్లులపై సమగ్రంగా దృష్టి సారిస్తే కోటి రూపాయలకుపైగా అవినీతి జరిగినట్లు తేలుతుందని కార్పొరేషన్ ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

సివిల్ వర్క్స్‌లో బోగస్ అంచనాలు

బోగస్ డీజిల్ బిల్లుల వ్యవహారం అలా ఉండగా మరో వర్క్ ఇన్‌స్పెక్టర్ సివిల్ వర్క్స్ బోగస్ అంచనాలు తయారు చేసి కొందరు కాంట్రాక్టర్లకు అయాచిత లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. సదరు వర్క్ ఇన్‌స్పెక్టర్ 309 మంది వర్కర్లు జాబితాలో పేరు లేకున్నా వారిపై బిల్లులు తయారు చేసినట్లు తెలుస్తోంది. బోగస్ సివిల్ వర్క్స్ అంచనాలు తయారుచేసి తన సామాజిక తరగతి వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేలా పని చేస్తున్నారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. ఈ వర్క్ఇన్‌స్పెక్టర్ ఓ వ్యక్తి పేరుపై కాంట్రాక్టర్ పనులు చేస్తూ బినామీగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారి విచారణలో బోగస్ వ్యవహారం బట్టబయలు!

ఇటీవల కార్పొరేషన్ ఉన్నతాధికారి డీజిల్ వినియోగంపై తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో బోగస్ బిల్లుల వ్యవహారం భారీగానే వెలుగు చూసినట్లు సమాచారం. వెంటనే అధికారి బిల్లులు తయారు చేసిన వర్క్ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసి కార్యాలయానికి రావాలని ఆదేశించారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని సదరు వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆరోజు తెలియజేశారు. రెండు రోజుల క్రితం ఆ ఇద్దరు డిఇల దగ్గర పనిచేసే వర్క్ ఇన్‌స్పెక్టర్లను ఉన్నతాధికారి తన ఛాంబర్‌కు పిలిపించి గట్టిగానే మందలించినట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరు డిఇలకు సంబంధించిన ఫైల్స్ అన్నీ తన వద్దకు తీసుకురావాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. బోగస్ బిల్లుల అవినీతి వ్యవహారం గుట్టు అంతా తన చేతిలో ఉందని సదరు ఉన్నతాధికారి గట్టిగానే వారిని హెచ్చరించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు జాబితాలో లేనివారు వేరొకరి స్థానంలో పనిచేస్తూ ఉండటంపైనా అధికారి విస్మయం వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌లో పని చేయాల్సిన ఓ వ్యక్తి ఇక్కడ విధులకు డుమ్మాకొట్టి బెంగళూరులో ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నా అతని ఖాతాకు డబ్బులు వేస్తున్న విషయాన్ని గుర్తించారు. సదరు వ్యక్తి స్థానంలో మరొక వ్యక్తిని నియమించి అతనికి రూ.3 వేలు, మిగిలిన రూ.9 వేలను బెంగుళూరులో ఉన్న వ్యక్తి ఖాతాలో వేస్తున్నట్లు ఉన్నతాధికారి గుర్తించి విధులకు రాని వ్యక్తికి డబ్బులు ఎలా ఇస్తున్నారంటూ సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. ఎన్ని రోజుల నుంచి ఈ వ్యవహారం జరుగుతున్న దానిపై వివరాలు సేకరించారు. బోగస్ బిల్లుల వ్యవహారంపై పూర్తి వివరాలను తీసుకున్న కార్పొరేషన్ ఉన్నతాధికారి బోగస్ డీజిల్ బిల్లులు, సివిల్ వర్క్స్ అంచనాల్లో అక్ర మాలపై విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. బోగస్ బిల్లులతో ఇప్పటివరకు కార్పొరేషన్ ఖజా నాకు ఎంత గండిపడిందో లెక్కలు తయారు చేసే పనిలో అధికారి ఉన్నారనే చర్చ ఉద్యోగ వర్గాల్లో నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో బోగస్ వ్యవహారం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందన్నది మరికొద్ది రోజుల్లో తేలనుంది.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కాకి పెట్టిన నిప్పు

- నాలుగు ఇళ్లు దగ్ధం


ప్రజాశక్తి- గరివిడి (విజయనగరం జిల్లా)

కార్తీక మాసం సందర్భంగా పెట్టిన దీపం నాలుగు ఇళ్లను బూడిద చేసిన సంఘటన మండలంలోని కోనూరులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. గ్రామంలో ఒక కుటుంబం తమ ఇంటి డాబాపై దీపాలను వెలిగించింది. ఓ కాకి ఇందులో ఓ దీపాన్ని ఎత్తుకెళ్లి సమీపంలోని ఓ ఇంటిపై పడేసింది. ఆ ఇంటి పైకప్పు తాటాకులతో ఉండడం వల్ల నిప్పంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. స్థానికులు అప్రమత్తమై మంటలు ఆర్పేందుకు ప్రయత్నించేలోపే చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు అవి విస్తరించాయి. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో మంటలను అదుపుచేశారు. ఆలోపే నాలుగు తాటాకు ఇళ్లు కాలిబూడిదయ్యాయి. ఇందులో ఓ ఇల్లు కౌలు రైతు నంబూరి గోపిది కాగా ఆయన ఇటీవల పంటల పెట్టుబడి కోసం రూ.లక్ష అప్పు చేసి తెచ్చి ఇంటో పెట్టాడు. ఈ ప్రమాదంలో ఆ సొమ్ముతో పాటు ఇంట్లోని అర తులం బంగారం కూడా కాలి బూడిదైందని ఆయన వాపోయాడు. తహశీల్దారు సిహెచ్ బంగార్రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి, సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన వాహనం.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- నంబులపూలకుంట (శ్రీసత్యసాయి జిల్లా)

శ్రీసత్యసాయి జిల్లా నంబులపూటకుంటలోని కదిరి రహదారిలో నిర్వహిస్తున్న ఓ కూరగాయల దుకాణంలోకి శనివారం ఇన్నోవా వాహనం దూసుకెళ్లడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎఎస్ఐ కిషోర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఆ దుకాణం వద్ద కొందరు వ్యక్తులు కూరగాయలు కొనుగోలు చేస్తుండగా ఉన్నఫళంగా అతివేగంగా వచ్చిన ఇన్నోవా వాహనం వారిపైకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో పాలెం శంకర, టి.శంకర, బి.మంజునాథ్ తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని ఎఎస్ఐ పరిశీలించి గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో మూడు ద్విచక్ర వాహనాలు, రెండు తోపుడు బండ్లు, కూరగాయల అంగడి దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తృటిలో తప్పిన పెనుప్రమాదం

- కంటైనర్‌ను ఢీకొన్న ప్రైవేటు బస్సు
- ప్రయాణికులు సురక్షితం

ప్రజాశక్తి- పెద్దవడుగూరు (అనంతపురం జిల్లా)

జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సుకు తృటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం... టివి కె ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు బస్సు హైదరాబాదు నుంచి బెంగళూరుకు ప్రయాణికులతో వెళ్తుండగా అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడితూరు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని దాటవేసే క్రమంలో పక్కన ఆగి మరమ్మతులకు గురైన క్రేన్‌తో వెళ్తే కంటైనర్ వాహనాన్ని ఢీకొంది. దీంతో, బస్సు ముందుభాగం దెబ్బతింది. అయితే, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు డ్రైవరు వీరశంకరాచారి సమయస్ఫూర్తితో పెనుప్రమాదం నుంచి బయటపడ్డారు. బస్సు యాజమాన్యం వెంటనే ప్రయాణికులను వారు చేరాల్సిన గమ్యానికి మరో వాహనంలో తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఎస్ఐ ఆంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.



మారుతి సుజుకి గ్రాండ్ విటారాలో లోపాలు

- 39వేల యూనిట్ల రీకాల్

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన గ్రాండ్ విటారాలో పలు లోపాలు ఉన్నట్లు గుర్తించింది. ఫ్యూయల్ లెవల్ ఇండికేటర్, వార్నింగ్ లైట్‌లో లోపం కారణంగా 39,506 యూనిట్లను ఈ రీకాల్ చేపట్టినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. 2024 డిసెంబర్ 9 నుంచి 2025 ఏప్రిల్ 29 మధ్య తయారైన వాహనాల్లో ఈ లోపాలు ఉన్నాయని గుర్తించినట్లు పేర్కొంది. ఈ బ్యాచ్‌లో ఉత్పత్తయిన కొన్ని వాహనాల్లో స్పీడోమీటర్ అసెంబ్లీలో ఫ్యూయల్ లెవల్ ఇండికేటర్, వార్నింగ్ లైట్ సరిగా పనిచేయడం లేదని మారుతి సుజుకి పేర్కొంది. దీనివల్ల ఫ్యూయల్ స్టేటస్ అస్పష్టంగా చూపిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో.. ఈ లోపాన్ని సరిచేసే విషయంలో కార్ల యజమానులకు మారుతీ సుజుకీ డీలర్ల నుంచి వ్యక్తిగతంగా సమాచారం అందుతుందని తెలిపింది. కారును తనిఖీ చేసి వాటికి సంబంధించిన పరికరాలను ఉచితంగా మార్చి ఇవ్వనున్నట్లు పేర్కొంది.

ఒడుదుడుకులు సహజం : ఆర్‌జెడి

పాట్నా : ప్రజాసేవలో ఒడుదుడుకులు సహజమని, పేదల పక్షాన గొంతు వినిపిస్తూనేవుంటుందని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) పేర్కొంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఆర్‌జెడి తొలిసారి స్పందిస్తూ శనివారం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. ప్రజాసేవ అనేది నిరంతర ప్రక్రియ అని, అది కొనసాగుతూనే ఉంటుందని తెలిపింది. ఈ క్రమంలో ఒడుదొడుకులు సహజమని, ఓటమితో విచారం, విజయంతో అహంకారం ఉండదని పేర్కొంది. ఆర్‌జెడి పేదల పార్టీ అని, వారి మధ్యనే ఉంటూ.. వారి గొంతుకను వినిపిస్తూనే ఉంటుందని తెలిపింది. బీహార్ ఎన్నికల ఫలితాల్లో మహాగట్బంధన్ 34 స్థానాలకే పరిమితం కాగా.. అందులో ఆర్‌జెడి 25 సీట్లు మాత్రమే పొందగలిగింది.

ముగ్గురు రెబల్స్‌ను సస్పెండ్ చేసిన బిజెపి

పాట్నా : మాజీ కేంద్ర మంత్రి, బీహార్ సీనియర్ నేత ఆర్.కె.సింగ్ సహా ముగ్గురు రెబల్స్‌ను బిజెపి శనివారం సస్పెండ్ చేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన ఒకరోజు తర్వాత ఈ చర్యలు చేపట్టింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆర్.కె.సింగ్ సహా ఎమ్మెల్యే అశోక్ అగర్వాల్, కతిహార్ మేయర్ ఉషా అగర్వాల్‌ను పార్టీ నుండి బహిష్కరించింది. బీహార్ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ అరవింద్ శర్మ ముగ్గురికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. వారిని పార్టీ నుండి ఎందుకు బహిష్కరించకూడదో వారంలో వివరణనివ్వాలని నోటీసుల్లో కోరారు.

బీహార్‌లోని అర్రా నుండి ఎన్నికైన మాజీ ఎంపి సింగ్, 2024 ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటి నుండి బిజెపికి ఎదురుతిరిగారు. ఎన్‌డిఎ నాయకత్వం, మిత్రపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తనపై విమర్శలు వచ్చిన వెంటనే ఆర్.కె.సింగ్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. బిజెపి కీలక అభ్యర్థి సామ్రాట్ చౌదరి, బిజెపి బీహార్ చీఫ్ దిలీప్ జైస్వాల్‌పై అవినీతి ఆరోపణలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు వివరణనివ్వాలని డిమాండ్ చేశారు. సామ్రాట్ చౌదరి, జైస్వాల్‌లు హత్య నిందితులు అని, అటువంటి వారికి ఓటు వేయవద్దని ప్రజలకు సూచించారు. చౌదరి విద్యార్హతపై సందేహాన్ని నివృత్తి చేసుకోవాలని,. జెడియు నేత అనంత్ సింగ్‌కు కూడా ఓటు వేయవద్దని వ్యాఖ్యానించారు.

గొడ్డు మాంసం, కాఫీ, పండ్లపై టారిఫ్‌లు తగ్గించిన ట్రంప్

వాషింగ్టన్ : గొడ్డు మాంసం, కాఫీ, పండ్లతో సహా పలు వస్తువులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌లను తగ్గించారు. ఈమేరకు శుక్రవారం ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకాలు చేశారు. ధరలు చాలా ఎక్కువగా వుంటున్నాయంటూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, ఒత్తిళ్ళ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఎన్నికల్లో ఏ ఓటరును కదిపినా అందరూ అన్నింటికంటే ఆర్థికపరమైన సమస్యలనే ముఖ్యంగా ఎత్తిచూపించారు. ఫలితంగా వర్జీనియా, న్యూజెర్సీల్లో జరిగిన ఎన్నికల్లో డెమోక్రాట్లు భారీగా విజయాలు సాధించారు. మొత్తంగా 200 ఆహార ఉత్పత్తులపై ట్రంప్ టారిఫ్‌లను తగ్గించారు. వీటిల్లో అరటిపళ్ళు, ఆరంజ్ జ్యూస్ వంటివి కూడా వున్నాయి. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసహనం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. దేశంలో ద్రవ్యోల్బణం లేదంటూ ట్రంప్ పదే పదే చెబుతూ వస్తున్నా టారిఫ్‌లు తగ్గించారంటే ప్రజల నుండి వచ్చిన ఒత్తిళ్ళు, రాజకీయ ఒత్తిళ్లు అన్నీ కారణాలుగానే కనిపిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్ వ్యూహం నుండి కొద్దిగా పక్కకు మళ్ళడమే అవుతోంది.


ఖాళీ అవుతున్న అల్ ఫలా వర్శిటీ

- ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

ఛండీగఢ్ : హర్యానాలోని అల్ ఫలా విశ్వవిద్యాలయం ఖాళీ అవుతోంది. విద్యార్థులు ఇళ్ల బాటపడుతున్నారు. ఢిల్లీ పేలుడు ఘటనకు సంబంధించి పలు విభాగాలు ఈ వర్శిటీలో ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వర్శిటీపై నిఘా నీడలు అలుముకున్నాయి. దీంతో క్యాంపస్‌లో భద్రత కట్టుదిట్టం చేయడంతోపాటు ముమ్మర తనిఖీలు చేపట్టారు. తాజా పరిణామాలతో అక్కడ చదువుతున్న వందలాది మంది విద్యార్థులు ఇళ్ల బాట పట్టారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమెరికాలో ప్రాపకానికి ఆర్‌ఎస్‌ఎస్ లాబీయింగ్

- అగ్రశ్రేణి ఏజెన్సీతో ఒప్పందం
- 'ఫాసిస్టు' ముద్రను చెరిపేసుకునేందుకు తంటాలు





న్యూయార్క్ : భారత స్వతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించి జాతిపితగా ఖ్యాతిగాంచిన మహాత్మాగాంధీని హత్య గావించడంతో పాటు దేశంలో అనేక మత కల్లోలాలకు కారణమైన మత విద్వేష సంస్థగా రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) అపఖ్యాతి మూటగట్టుకుంది. గుజరాత్‌లో ముస్లింల నరమేధం నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌ను ఫాసిస్టు పారా మిలటరీ సంస్థగానే విశ్వ ప్రజానీకం భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ ముద్రను చెరిపేసుకునేందుకు నానా తంటాలు పడుతోంది. ఈ క్రమంలోనే విదేశాల్లో తన ప్రాపకాన్ని పెంచుకునేందుకు ఏకంగా కార్పొరేట్ సంస్థల తరహాలో ఒక లాబీయింగ్ ఏజెన్సీతోనే ఒప్పందం చేసుకుంది. ప్రముఖ అమెరికన్ వెబ్ పోర్టల్ 'ప్రిజమ్' నివేదిక ప్రకారం..ఆర్‌ఎస్‌ఎస్ తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి రూ.కోట్ల మొత్తం ఖర్చు చేస్తోంది. అమెరికాలో చట్టసభ అయిన యుఎస్ కాంగ్రెస్‌లోని విధాన రూపకర్తలు ఆర్‌ఎస్‌ఎస్‌కు సానుకూలంగా వ్యవహరించేలా చూడటానికి అగ్రశ్రేణి లాబీయింగ్ ఏజెన్సీ అయిన స్క్వైర్ పాటన్ బోగ్స్ (Squire Patton Boggs)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకోసం బోగ్స్ సంస్థకు కోట్లాది రూపాయలు కుమ్మరించింది. 2025 మొదటి మూడు త్రైమాసికాలలో ఈ సంస్థకు 330000 అమెరికన్ డాలర్లు (దాదాపు రూ.2.75 కోట్లు) ఆర్‌ఎస్‌ఎస్ చెల్లించింది. విదేశాలకు చెందిన ఒక మత, లేదా సాంస్కృతిక సంస్థ అమెరికాలో లాబీయింగ్ ఏజెన్సీని నియమించుకోవడం ఇదే తొలిసారి అని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా– భారత ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన అంశాలపై ఆ సంస్థ పనిచేసింద'ని లాబీయింగ్ రిజిస్టరీ సందర్భంగా సంబంధిత పత్రాలలో ఆర్‌ఎస్‌ఎస్‌ను పేర్కొన్నారు. అయితే ఈ చర్య అమెరికా ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ (ఎఫ్‌ఎఆర్‌ఎ) పరిధిలోకి రిజిస్టర్ చేయించాల్సివుండేదని నిపుణులు చెబుతున్నారు.

బోగ్స్ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ తరపున లాబీయింగ్‌లో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రతిష్టను పెంచేందుకు పనిచేస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ తరపున అమెరికా పార్లమెంటేరియన్, విధాన రూపకర్తలను సంప్రదించి దాని చరిత్ర, 'లక్ష్యం' గురించి సమాచారాన్ని అందించడానికి ఇప్పటికే ప్రయత్నించిందని ప్రిజమ్ పేర్కొంది. అమెరికన్ ప్రొఫెసర్ ఆడ్రీ ట్రుష్కేను లాబీయిస్ట్ బ్రాడ్‌ఫోర్డ్ ఎల్లిసన్ సంప్రదించి ఆర్‌ఎస్‌ఎస్ ప్రతిష్ట పెంచాలని కోరారు. ఇందుకోసం ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం, ప్రభావం గురించి చట్టసభ సభ్యులకు అవగాహన కల్పించాలనుకుంటున్నట్టుగా ఎల్లిసన్..ఆడ్రీతో పేర్కొన్నారు. ప్రిజంకు లభించిన సమాచారం ప్రకారం, ఈ సంవత్సరం నాగ్‌పూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం, శిక్షణా శిబిరాన్ని కూడా లాబీయింగ్ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్శనను భారత్, అమెరికా పౌర సమాజ సంప్రదింపుల్లో కీలకమైన క్షణంగా ఆర్‌ఎస్‌ఎస్ పేర్కొంది. ఈ లాబీయింగ్‌లో భాగస్వామ్యమైనవారిలో మాజీ రిపబ్లికన్ యూఎస్ కాంగ్రెస్ సభ్యుడు బిల్ షుస్టర్, అతని సోదరుడు బాబ్ షుస్టర్ (వన్ స్ట్రాటజీస్ అనే సంస్థను నడుపుతున్నాడు) అనేక మంది మాజీ కాంగ్రెస్ సహాయకులు ఉన్నారని కూడా నివేదిక పేర్కొంది. లాబీయింగ్ దాఖలు బోస్టన్‌కు చెందిన ఫార్మాస్యూటికల్ వ్యాపారవేత్త వివేక్ శర్మ పేరును కూడా పేర్కొంది. అతను 5,000 అమెరికన్ డాలర్లు కంటే ఎక్కువ విరాళం ఇచ్చాడు. అంతేకాకుండా లాబీయింగ్ కార్యకలాపాలలో పాల్గొన్నాడు. ఆర్‌ఎస్‌ఎస్‌కు భారతదేశ పాలక పార్టీ బిజెపితో గాఢమైన సంబంధాలు ఉన్నందున, దానిని 'విదేశీ రాజకీయ సంస్థ'గా పరిగణించి లాబీయింగ్ డిస్క్లోజర్ యాక్ట్ (ఎల్‌డిఎ) కింద కాకుండా, ఎఫ్‌ఎఆర్‌ఎ కింద నమోదు చేసి ఉండాలని నిపుణులు పేర్కొన్నారు. 2020లో ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బిజెపి– యుఎస్‌ఎ కూడా అమెరికా ఎన్నికల సమయంలో బిజెపి ప్రచారంలో పాల్గొన్నప్పుడు విదేశీ ఏజెంట్‌గా నమోదు చేసుకోవాల్సి వచ్చిందని నివేదిక పేర్కొన్నది. ప్రిజం నివేదిక ప్రకారం, ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ఈ లాబీయింగ్ అమెరికన్ విధాన రూపకర్తలలో దాని ఇమేజ్‌ను మెరుగుపరుచుకునే ప్రయత్నంగా పేర్కొంది. అమెరికాకు చెందిన సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఆర్గనైజ్డ్ హేట్ డైరెక్టర్ రకీబ్ హమీద్ నాయక్ మాట్లాడుతూ..భారతదేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పుడు ప్రధాన స్రవంతి శక్తిగా మారిందని, కానీ ప్రపంచవ్యాప్తంగా దీనిని ఇప్పటికీ 'ఫాసిస్ట్ పారామిలిటరీ సంస్థ'గానే చూస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ముద్రను చెరిపేసుకునే ప్రయత్నాల్లోనే ఇలాంటి లాబీయింగ్ చర్యల ద్వారా ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల కమిషన్ ప్రతిష్ట దిగజారింది

- బీహార్ ఎన్నికల ఫలితంపై స్టాలిన్



చెన్నై : భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) ప్రతిష్ట దిగజారిందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యాఖ్యానించారు. బీహార్ ఎన్నికల ఫలితంపై ఆయన శనివారం ఎక్స్‌లో స్పందించారు. బీహార్ ఎన్నికల ఫలితం ఇసిఐ దుష్ప్రవర్తన మరియు నిర్లక్ష్యపు చర్యలను కప్పిపుచ్చలేదని అన్నారు. "ఇసిఐ ఖ్యాతి దిగజారింది. ఈ దేశ పౌరులు సమర్థవంతమైన మరియు మరింత నిష్పాక్షికమైన ఇసిఐకి అర్హులు. ఓటమిపాలైన వారిలో కూడా విశ్వాసాన్ని నింపేలా ఇసిఐ ఉండాలి " అని పేర్కొన్నారు. నితీష్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్ మరియు ఇతర కూటమి నేతలు అవిశ్రాంతంగా ప్రచారం నిర్వహించారని ప్రశంసించారు. ఈ ఫలితంతో ఇండియా కూటమి ఎంతో నేర్చుకోవాలన్నారు. సంక్షేమాలు, సామాజిక, సైద్ధాంతిక సంకీర్ణాలు, స్థిరమైన ప్రచారంపై ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయన్నారు. ఇండియా కూటమిలో అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులు ఉన్నారన్నారు. భవిష్యత్తులో వచ్చే కొత్త రాజకీయ సవాళ్లను పరిష్కరించేందుకు వ్యూహాత్మక ప్రణాళిక వేయగలరన్నారు.

గందరగోళంగా ఎస్ఐఆర్


- టివికె నేత విజయ్

చెన్నై : తమిళనాడులో కొనసాగుతున్న ఓటర్ల జాబిత ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)పై తమిళగ వెట్రి కళగం (టివికె) అధినేత, సినీ నటుడు విజయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ అంతా గందరగోళంగా తయారయ్యిందన్నారు. అమలులో లోపాల వల్ల పౌరులు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తాజా పరిస్థితుల్లో ఓటరు జాబితాలో తమ పేర్లు ఉంటాయో లేదో తెలియని అనిశ్చితి నెలకొందని పేర్కొంటూ ఈ మేరకు శనివారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు.

'ఓటు మనందరికీ రాజ్యాంగం కల్పించిన హక్కు. నిజజీవితంలో ఓటు హక్కు ఎంతో కీలకంగా మారింది. ప్రస్తుత ఎస్ఐఆర్ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో చాలామందికి తెలియదు. రాష్ట్రంలో ప్రస్తుతం చాలా మందికి ఓటు లేదన్న మాట నిజం. అందుకు ప్రధాన కారణం ఎస్ఐఆర్. రాష్ట్రంలో 6.36 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రం స్థాయి అధికారి ధ్రువీకరించిన తర్వాతే తుది ఓటరు జాబితా ప్రచురిస్తారు. అప్పటివరకు మనం ఓటర్లమో కాదో కచ్చితంగా ఎవరికీ తెలియదు. అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండి, బిఎల్ఓల నుంచి రసీదులు తీసుకోవాలి" అని విజయ్ పేర్కొన్నారు. నెల వ్యవధిలో ఈ ప్రక్రియ పూర్తి చేయడాన్ని ప్రశ్నించిన విజయ్.. జెన్ జి యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ తరం ఓటర్లదే కీలక పాత్ర అని, అందుకే ఓటరు జాబితాలో వీరి పేర్లు లేకుండా ప్రయత్నాలు చేసే ప్రమాదం ఉందన్నారు. మరోవైపు 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొత్తంగా ఇప్పటివరకు 95శాతం (48.67 కోట్లు) ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేశామని ఎన్నికల సంఘం వెల్లడించింది. నవంబర్ 4న మొదలైన ఈ ప్రక్రియ డిసెంబర్ 4వరకు కొనసాగుతుందని తెలిపింది.

పాక్‌లో ముదిరిన న్యాయ సంక్షోభం

- రాజ్యాంగ కోర్టు ఏర్పాటుతో గందరగోళం
- నిరసనగా ఇప్పటికే ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రాజీనామా
- అదే బాటలోనే లాహోర్ హైకోర్టు సీనియర్ జడ్జి కూడా



లాహోర్ : పాకిస్తాన్‌లో సుప్రీంకోర్టుకు కంటే ఉన్నతస్థానంలో ప్రత్యేకంగా ఫెడరల్ కానిస్ట్యూషనల్ కోర్టు (సమాఖ్య రాజ్యాంగ న్యాయస్థానం– ఎఫ్‌సిసి) ఏర్పాటు చేస్తూ తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ అక్కడి న్యాయవ్యవస్థ సంక్షోభానికి దారితీస్తోంది. ఎఫ్‌సిసి ఏర్పాటు కోసం చేపట్టిన రాజ్యాంగ సవరణ పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇదివరకే ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రాజీనామా చేశారు. ఇప్పుడు అదే బాటలో శనివారం నాడు లాహోర్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి షామ్స్ మెహమూద్ మీర్జా వైదొలిగారు. దీంతో ఆయన వివాదాస్పదమైన సవరణ చట్టంగా మారిన తర్వాత రాజీనామా చేసిన తొలి హైకోర్టు న్యాయమూర్తి అయ్యారు. జస్టిస్ మీర్జా 2028లో పదవీ విరమణ చేయాల్సి వుంది. ఈ పరిణామాలతో అక్కడి న్యాయ నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దేశ రాజ్యాంగానికి నూతనంగా తీసుకువచ్చిన సవరణ ద్వారా రాజ్యాంగంపై, న్యాయవ్యవస్థపై దాడి చేయడాన్ని వారందరూ తీవ్రంగా నిరసించారు. సవరించిన చట్టం ప్రకారం, రాజ్యాంగానికి సంబంధించిన అంశాలను విచారించడానికి ఫెడరల్ రాజ్యాంగ కోర్టు (ఎఫ్‌సిసి)ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతమున్న సుప్రీం కోర్టు కేవలం సాంప్రదాయ సివిల్, క్రిమినల్ కేసులను మాత్రమే విచారిస్తుంది. కొత్తగా ఏర్పాటు చేసిన పాకిస్తాన్ ఫెడరల్ రాజ్యాంగ కోర్టుకు తొలి చీఫ్ జస్టిస్‌గా జస్టిస్ అమినుద్దీన్ ఖాన్ నియమితులయ్యారు. ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ 2030వరకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సిడిఎఫ్) పదవిలో కొనసాగేందుకు కూడా రాజ్యాంగానికి చేసిన ఈ 27వ సవరణ అనుమతిస్తుంది. 27వ సవరణను అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఆమోదించిన గంటల వ్యవధిలోనే ఈ నెల 13న సుప్రీం సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ సయ్యద్‌మన్సూర్ అలీ షా, జస్టిస్ అథర్ మినల్లా రాజీనామా చేశారు. దేశ అత్యున్నత న్యాయ వేదికగా వున్న సుప్రీం కోర్టును ఎఫ్‌సిసి కాలరాచిందని వారు విమర్శించారు. ఎఫ్‌సిసి తీసుకున్న నిర్ణయాలకే సుప్రీంకోర్టు సహా అన్ని కోర్టులు కట్టుబడి వుండాలి. దీన్ని వారు తీవ్రంగా నిరసించారు.

దేశవ్యాప్తంగా బిర్సా ముండా జయంతి వేడుకలు

- పార్లమెంటు ఆవరణలో రాష్ట్రపతి ముర్ము నివాళి

న్యూఢిల్లీ : స్వాతంత్ర సమరయోధుడు, ఆంగ్లేయులతో పాటు పెత్తందారుల దోపిడీ విధానాలపై వీరోచిత పోరు సాగించిన ఆదివాసీ యోధ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా శనివారం దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా అనేక మంది ఆయనకు ఘన నివాళులర్పించారు. రాష్ట్రపతి ముర్ము..ఢిల్లీలోని పార్లమెంటు హౌస్ వద్ద బిర్సా ముండా విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ..గుజరాత్‌లోని దేదియపాదలో ఉన్న బిర్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పార్లమెంటు ఆవరణలోని బిర్సా ముండా విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

'ఉల్గులాన్' జిందాబాద్ : సిపిఎం

బిర్సా 150వ జయంతి సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆయనకు 'ఉల్గులాన్ జిందాబాద్' (విప్లవం వర్ధిల్లాలి) అంటూ ఘన నివాళు లర్పించింది. 1900ల్లో ఆదివాసీలపై పెత్తందారుల దోపిడీ చర్యలను వ్యతిరేకిస్తూ 'ఉల్గులాన్ జిందాబాద్' నినాదంతో బిర్సా తిరుగుబాటు చేపట్టారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. బిర్సా ముండా.. స్ఫూర్తిదాయక ఆదివాసీ నాయకులు అని, స్వాతంత్ర సమరయోధులు అని, భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా ఆయన ధీరోదాత్తంగా పోరాడారని సిపిఎం కొనియాడింది. బిర్సా ముండా జార్ఖండ్‌లోని ఉలిహటు గ్రామంలో 1875 నవంబరు 15న జన్మించారు. ఆంగ్లేయులు, దోపిడీదారులకు వ్యతిరేకంగా 'ముండా ఉల్గులాన్ జిందాబాద్' పేరుతో ఉద్యమాన్ని చేపట్టి బిర్సా తెగకు నాయకునిగా ఆయన ఆవిర్భవించారు. 1899లో సాయుధ పోరాట పంథా ఎంచుకొని ఆంగ్లేయుల ఆస్తులను ధ్వంసం చేశారు. నాటి బ్రిటీష్ అధికారులకు సింహస్వప్నంగా మారిన ఆయనను పోలీసు అరెస్టు చేశారు. జైలులో ఉండగానే 1900 జూన్ 9న ఆయన తుదిశ్వాస విడిచారు. అయితే నాడు బ్రిటీష్‌వారి విషప్రయోగం వల్లే బిర్సా చనిపోయినట్లు చరిత్రకారులు చెబుతారు.

'ఐ బొమ్మ' నిర్వాహకుడు అరెస్ట్

- సినిమాల పైరసీలో నేరస్థుడు రవి
- వైజాగ్‌లోనూ దర్యాప్తు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో



ఎట్టకేలకు 'ఐ బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెట్టింగ్, గేమింగ్ యాప్ మాఫియాలతో కుమ్మక్కైన రవి ఆరు సంవత్సరాల్లో వేలాది పైరసీ సినిమాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. కొద్ది నెలల కిందట తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు మేరకు ఐ బొమ్మతోపాటు, 65 పైరసీ వెబ్‌సైట్‌లపై కేసు నమోదు చేసిన సిసిఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ఐదుగురు పైరసీ నేరస్థులను అరెస్టు చేశారు. అయితే.. తనను పట్టుకోలేరంటూ హైదరాబాద్ పోలీసులకు రవి సవాల్ విసిరాడు. 2019 నుంచి 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌లో పైరసీ చేసిన వీడియోలు అప్‌లోడ్ చేస్తున్న రవి ఇంతకాలం పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరిగాడు. పెద్దఎత్తున ఆస్తులు కూడబెట్టినట్టు సమాచారం. చివరకు సిసిఎస్ పోలీసులు శనివారం రవిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఓ అపార్టుమెంట్‌లో నివాసముంటున్న రవి ఇంట్లో నుంచి వందల హార్డ్ డిస్క్‌లు, పెద్దఎత్తున కంప్యూటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. రవి ఉపయోగించిన సర్వర్లను సైతం గుర్తించినట్టు సమాచారం. నిందితుడిని నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు.

ఫ్రాన్స్ నుంచి ఇండియాకు

ఇమ్మడి రవిని అతని భార్యనే పట్టించినట్టు ప్రచారం జరుగుతోంది. ఇమ్మడి రవికి, ఆయన భార్యకు కొంతకాలంగా తగాదాలు నడుస్తున్నాయి. విడాకుల కేసు విషయంలో ఫ్రాన్స్‌లో ఉన్న రవి ఇండియాకు వస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. కొద్ది నెలలుగా గాలిస్తున్న పోలీసులు.. రవిపై ప్రత్యేక నిఘా వేసిన విషయం తెలిసిందే. అయితే హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, బెంగళూర్ తదితర ప్రాంతాల్లో తలదాచుకున్నట్టు ముందుగా అనుమానించారు. రవి ఐడి ఇతర దేశాల్లో చూపించినా ఇండియాలోనే ఉన్నట్టు భావించారు. అయితే రవి ఫ్రాన్స్‌లో ఉన్నాడని, శుక్రవారం వస్తున్నాడని తాజాగా సమాచారం అందింది. దాంతో అప్రమత్తమైన పోలీసులు నిఘా పెంచి రవి హైదరాబాద్‌కు రాగానే అదుపులోకి తీసుకున్నారు. ఈ సమాచారం అతని భార్యే ఇచ్చినట్టు ప్రచారం జోరుగా సాగుతోంది. హైదరాబాద్‌తోపాటు అతని స్వస్థలం విశాఖలో సైతం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

సమస్యల పరిష్కారానికి సమైక్య పోరు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసగిస్తున్నాయని వివరించారు. నాడు విజన్ 2020 పేరుతో ప్రజలను మోసగించిన చంద్రబాబు... నేడు విజన్ 2047 పేరుతో మరోసారి దగా చేస్తున్నారని విమర్శించారు. బహిరంగ సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం అధ్యక్షత వహించారు. సభలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడారు.

భారీ ర్యాలీ

రాష్ట్ర మహాసభ ప్రారంభం సందర్భంగా ఒంగోలులో భారీ ర్యాలీ నిర్వహించారు. 15వ మహాసభ సూచకంగా 15 జెండాలు చేతపట్టిన మహిళా కార్యకర్తలు ర్యాలీ అగ్రభాగాన కదిలారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన సంఘం నేతలు, కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వివిధ సంస్కృతులను ప్రతిబింబిస్తూ కళాకారుల ప్రదర్శనలతో మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ హెడ్ పోస్టాఫీస్, చర్చి సెంటర్, మిరియాలపాలెం సెంటర్, మస్తాన్ దర్గా, పాత మార్కెట్, బాపూజీ మార్కెట్, అద్దంకి బస్టాండ్, తులసిరామ్ సెంటర్, బస్టాండ్ మీదుగా కొత్త మార్కెట్ సభా స్థలి వరకు సాగింది. ర్యాలీలో కళా ప్రదర్శనలు, ప్రజానాట్యమండలి గేయాలు ఆకట్టుకున్నాయి. బహిరంగ సభ అనంతరం మహాసభ ప్రారంభమైంది.

శ్రీనగర్ పోలీస్ స్టేషన్‌లో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

ముగ్గురు, మరో ఇద్దరు క్రైమ్ విభాగ ఫోటోగ్రాఫర్లు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ఇదే బృందంతో సంబంధమున్న ఒక టైలర్ మరణించినట్లు జమ్ముకాశ్మీర్ డిజిపి నళిన్ ప్రభాత్ తెలిపారు. వీరితో పాటు మరో 27 మంది పోలీసు సిబ్బంది, ఇద్దరు రెవెన్యూ అధికారులు, పక్కనే ఉన్న ముగ్గురు పౌరులు మొత్తం 32 మంది గాయపడ్డారని పేర్కొన్నారు. వీరందరినీ సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. తీవ్ర దు:ఖంలో ఉన్న మృతుల కుటుంబ సభ్యులకు సంఘీభావం ప్రకటించారు.

మేమే పేల్చాం : జైషే

మరోవైపు ఈ పేలుడుకు పాల్పడింది తామేనని ఉగ్రవాద సంస్థ జైషేకు అనుబంధంగా పనిచేస్తున్న పీపుల్స్ – యాంటీ ఫాసిస్టు ఫోర్స్ (పిఎఎఫ్ఎఫ్) ప్రకటించింది. అయితే ఈ ప్రకటనను డిజిపి నళిన్ ప్రభాత్ ఖండించారు. నౌగామ్ పేలుడు కేవలం ప్రమాదవశాత్తూ జరిగిందని స్పష్టం చేశారు.

ప్రమాదమే..: కేంద్ర హోంశాఖ

శ్రీనగర్‌లోని నౌగామ్ పోలీసు స్టేషన్‌లో జరిగిన పేలుడు ముమ్మాటికీ ప్రమాదమేనని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే తెలిపారు. 'హర్యానాలోని టెర్రర్ మాడ్యూల్‌పై దర్యాప్తు చేస్తున్న సమయంలో భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు, రసాయనాల నిల్వలను స్వాధీనం చేసుకొని వాటిని శ్రీనగర్ శివార్లలో ఉన్న నౌగామ్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని బహిరంగ ప్రదేశంలో భద్రపర్చాం. ఆ తరువాత వాటిని ప్రామాణిక, నిర్దేశిత విధానంలో ఫోరెన్సిక్, రసాయన పరీక్షకు పంపాం. రెండు రోజులుగా ఈ ప్రక్రియ నిరంతరంగా జరుగుతోంది. అయితే ఆ పేలుడు పదార్థాలు చాలా సున్నితమైనవి కావడం వల్ల, నిపుణుల పర్యవేక్షణలో వాటిని జాగ్రత్తగా నిర్వహిస్తున్నాం. అయితే నవంబర్ 14 రాత్రి 11.20 గంటల సమయంలో ప్రమాదవశాత్తు భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. 32 మంది గాయపడ్డారు. పేలుడు ధాటికి పోలీస్ స్టేషన్ తీవ్రంగా దెబ్బతింది. చుట్టుపక్కల ఉన్న కొన్ని భవనాలు కూడా దెబ్బతిన్నాయి. పేలుడుకు గల కారణాలను పరిశీలిస్తున్నారు. దీనిపై ఊహాగానాలు అనవసరం' అని ప్రశాంత్ లోఖండే పేర్కొన్నారు.

బిర్సాముండా స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల కోసం పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారని తెలిపారు. ప్రజలను కూడగట్టి బ్రిటీష్‌వాళ్లను గడగడలాడించారని తెలిపారు. ఆదివాసీ కుటుంబంలో పుట్టి బ్రిటీష్‌వాళ్లకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం చరిత్ర పుటల్లో సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని అన్నారు.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా, రాష్ట్రంలోనూ కార్పొరేట్లకు భూములు కట్టబెడుతున్నారని అన్నారు. ఆస్తులు, భూములు, నేల, నీరు అన్నిటినీ పెట్టుబడుల కోసం దురాక్రమణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో బిర్సాముండా లాంటి యోధుల స్ఫూర్తితో పోరాడాలని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో హైడల్ ప్రాజెక్టులు, మైనింగ్ పేరుతో సాగిస్తున్న దోపిడీ ఏజెన్సీ ప్రాంతాల ఉనికిని ప్రశ్నిస్తోందని అన్నారు. ప్రాజెక్టుల పేరుతో గిరిజనులను తరిమేస్తున్న ప్రభుత్వాలు గిరిజనుల పునరావాసం గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో 12శాతం పునరావాసం కూడా పూర్తికాలేదని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 72 సంవత్సరాలు అవుతున్నా గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ కనీస సదుపాయాలు లేవని అన్నారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఏడాదిలోపు డోలీ సంస్కృతి లేకుండా చేస్తానని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చెప్పారని, ఏడాదిన్నర అవుతున్నా అడుగుముందుకు పడలేదని అన్నారు. పివిటిజిలు మరింత వెనుకబడి ఉన్నారని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆదివాసీలను మరింత వెనుకబాటుకు గురిచేసే పనులు చేస్తోందని తెలిపారు. బిర్సా ముండా హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా, బ్రిటీష్ దోపిడీని కాపాడేందుకు వచ్చిన క్రిష్టియన్ మిషనరీలకు వ్యతిరేకంగా పోరాడారని, ప్రత్యామ్నాయంగా బిర్సాయిట్ మతాన్ని స్థాపించారని అన్నారు. నేడు బిజెపి బిర్సా ముండాను క్రిష్టియన్ వ్యతిరేకిగా చూపించి చరిత్రను వక్రీకరిస్తున్నదని అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడనీ బిర్సాముండా త్యాగాన్ని శ్రీనివాసరావు కొనియాడారు.

బీహార్‌లో ప్రజల మధ్య చిచ్చుపెట్టి గెలిచారు

బీహార్లో బిజెపి విజయం నిజమైన ప్రజాతంత్ర విజయం కాదని అన్నారు. ప్రజల మధ్య, కులాల మధ్య చిచ్చుపెట్టి, ఓటర్ల లిస్టులను తారుమారు చేసి అధికారంలోకి వచ్చారని అన్నారు. ప్రభుత్వ స్కీములను కూడా ఎన్నికల కోసం వినియోగించారని అన్నారు. ఎన్నికల ముందు పదివేల రూపాయలు మహిళల ఖాతాలో వేసి ప్రభుత్వ డబ్బుతో ఓట్లు కొనుగోలు చేశారని అన్నారు. బీహార్లో ఇప్పటికీ అరాచకం, హింస, అత్యాచారాలు, మైనింగ్, బొగ్గు, ఎడ్యుకేషన్ మాఫియా తీవ్రంగా ఉందని అన్నారు. కేంద్రంలో ఎన్‌డిఎ కొనసాగితే మన రాష్ట్రం కూడా మరో బీహార్‌గా మారుతుందని అన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ప్రజలను సమీకరించి సాయుధ పోరాటాన్ని కొనసాగించి అత్యంత పిన్నవయస్సులో బిర్సా ముండా వీరమరణం పొందారని అన్నారు. ఆయన పోరాటం ఫలితంగా నాటి బ్రిటీషు ప్రభుత్వమే అటవీ భూమిపై హక్కులు కల్పించే చట్టం తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఆదివాసీ సంస్కృతి అభివృద్ధికి బిర్సా ముండా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరాం, ఎం.సూర్యారావు, ఎం.హరిబాబు, జి.రామన్న పాల్గొన్నారు.

సతీష్‌కుమార్ మృతిపై విచారణ వేగవంతం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మృతదేహం లభించిన ప్రాంతానికి గంట ప్రయాణం జరిగింది. ఈలోపు ఏమి జరిగిందన్నది ఇప్పుడు పోలీసులు ఆరా తీస్తున్నారు. సతీష్‌కుమార్ ప్రయాణించిన ఎ–1 బోగిలో తోటి ప్రయాణికులు ఎవరెవరున్నారన్న దానిపైనా పోలీసులు కూపీ లాగుతున్నారు. వారి ద్వారా సమాచారం కొంత సేకరించేందుకు వీలుంటుందని భావిస్తున్నారు. సాధారణంగా ఎసి బోగిల్లో రైల్వే శాఖ సిసి కెమెరాలను అమర్చింది. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ఎ–1 బోగిలో సిసి కెమెరాలు లేనట్టు తెలుస్తోంది. ఇవి ఉండి ఉంటే సతీష్‌కుమార్ మృతిపై మరింత స్పష్టత వచ్చేదని పోలీసులు భావిస్తున్నారు.

పోస్టుమార్టంలో ఏముంది?

సతీష్‌కుమార్ మరణం అనుమానాస్పదం కావడంతో కీలకంగా పోస్టుమార్టం నివేదికపై పోలీసులు దృష్టి సారించారు. పోస్టుమార్టం సమయంలో రాయలసీమ రేంజ్ డిఐజి, అనంతపురం ఎస్‌పి ప్రత్యక్షంగా పరిశీలించారు. శనివారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులతో సమావేశమయ్యారు. వెనుకభాగంలో ఎక్కువగా గాయాలవడంతో సతీష్‌కుమార్‌కు మృతి చెందినట్టు తెలుస్తోంది. దీనికి కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు మృతదేహం పడి ఉన్న కోమలి రైల్వే స్టేషన్ సమీపంలో సీన్ రీ కన్‌స్ట్రక్చన్ చేశారు. రైలు నుంచి కిందకు పడితే ఏ రకంగా గాయాలయ్యే అవకాశముందని బొమ్మల ద్వారా పరిశీలించారు. రైల్వే ట్రాక్‌పై ప్రమాదం జరగడంతో గుత్తి రైల్వే పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఇందులో అనేక సందేహాలు ఉండడంతో కేసు విచారణను మరింత లోతుగా చేసేందుకు తాడిపత్రి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు.

జీవన సౌరభం


గుర్తింపు లేదని బాధపడకు.. ఆ గుర్తింపునకు కావాల్సిన అర్హత కోసం పాటుపడు.

మీ కోసం

మిక్సీలో ఇడ్లీ, అట్లు పిండి రుబ్బేటప్పుడు బాగా చల్లగా ఉన్న నీళ్లను పోస్తూ ఉంటే పిండి ఒదుగు అవుతుంది.



తీయనైన భాష మన తెలుగు




తెలుగు... మన మాతృభాష. మన సొంత భాష. తేనే కంటే తీయనైన భాష. తెలుగుని స్వచ్ఛమైన భాష అని కూడా చెబుదాము. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అంటే మాట్లాడడానికి వీలుగా ఉంటుంది అని అర్థం. గిడుగు వెంకట రామమూర్తి ఎంతో కృషి చేసింది ఇందుకే. ఇంత గొప్ప భాషను వాడుతున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. దేనినైనా వర్ణించాలన్నా, చెప్పాలన్నా భాష కదా ముఖ్యం. అలాంటి మాతృభాషను ప్రేమించేవాడు రాష్ట్రాన్ని ప్రేమించినట్లే. మన దేశాన్ని గౌరవించినట్లే. మన భాషను చెడ్డగా వాడడమే విషాదకరం. సంస్కృతంలో ఉన్న వాటిని తెలుగులోకి మార్చడానికి కారణం మన భాష సులభంగా ఉంటుందని. పేదవాని నుండి పెద్ద ధనవంతుడి వరకు మన మాతృభాషనే వాడుతున్నారు. మాతృభాషకు కులమత భేదాలు లేవు. అలాంటి భాషను ప్రేమించుదాం, గుర్తుపెట్టుకుందాము.



– పి. సంహిత,
8వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.

తాళం చెవి

పిల్లలూ, ఇక్కడ తాళాలు, పక్కనే వాటి చెవిలు ఉన్నాయి కదా! ఏ తాళానికి ఏ చెవి సరిపోతుందో జాగ్రత్తగా పరిశీలించండి. ఆ చెవిలో సరైన తాళం అంకెను వేయండి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం.



నేను గీసిన బొమ్మ





కె. హన్సిక, 6వ తరగతి,
తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల,
చింతకుంట, కరీంనగర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వైకల్యాన్ని దాటి.. పతకాల వేటకు సై...

పుట్టుకతోనే శారీరక వైకల్యం.. మరో వైపు పేదరికం... ఎన్నో అవమానాలు.. కానీ తనకు నచ్చిన వాలీబాల్ క్రీడనే నమ్ముకున్నాడు. తనే కోచ్‌గా, తనే క్రీడాకారుడిగా మారి వ్యక్తిగతంగా శిక్షణ పొందుతూ ప్రపంచస్థాయిలో రాణిస్తున్నాడు. అతడే అన్నం గణేష్. పేదరికం తాలూకా ఇబ్బందులు వెంటాడుతున్నా- తను ఎంచుకున్న పారా వాలీబాల్ క్రీడలో పట్టుదలతో ముందుకు సాగుతున్నాడు. ప్రాక్టీస్ చేయటానికి సరైన మైదానం లేకపోయినా గ్రామంలోనే ప్రాక్టీస్‌ను కొనసాగిస్తున్నాడు. పతకం సాధించాలనే నమ్మకంతో నిరంతరం సాధన చేస్తుంటాడు. 2028 పారా ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించటమే లక్ష్యంగా తన ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నాడు.



అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం సోముదేవపల్లి గ్రామానికి చెందిన అన్నం అర్జునరావు, మణి దంపతుల కుమారుడు అన్నం గణేష్. విభిన్న ప్రతిభావంతుడైన ఆయనకు వాలీబాల్ ఆట అంటే ఎంతో ఇష్టం. ఒకటి నుంచి 7వ తరగతి వరకూ సోముదేవిపల్లిలోనూ, 8 నుంచి పదో తరగతి వరకూ ధర్మవరంలోని డిహెచ్ అగ్రహారంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో చదివాడు. అడ్డురోడ్డులోని శ్రీ ప్రజ్ఞ కళాశాలలో ఇంటర్, యలమంచిలిలోని శ్రీ గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, పీజీ పూర్తిచేశాడు. గణేష్ చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ ఆటలపై బాగా ఆసక్తి చూపేవాడు. ఆడిన మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చేవారు. పాఠశాల, కళాశాల విద్యలోనూ ఏటేటా జరుగుతున్న ఆటల పోటీల్లో సత్తాచాటాడు. ప్రపంచస్థాయి పారా ఒలింపిక్ క్రీడాకారుడుగా ఘనతికెక్కాడు. ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. అంగవైకల్యం ఉన్నా ఏనాడూ వెనుకంజ వేయలేదు. 'ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఇబ్బందులు పడుతుంటే నీకు ఆటలు అవసరమా? ఏదో ఒక కూలి పనిచేసుకుని బ్రతకొచ్చుగా' అని అన్నవాళ్లు ఉన్నారు. సెలవు రోజుల్లో ఓ వైపు ఏదో ఒక ఉపాధి పనులు చేసుకుంటూనే మరో వైపు చదువును కొనసాగిస్తూ ఇంకోవైపు తనకు నచ్చిన క్రీడలో ప్రాక్టీస్‌ను సైతం సాగించేవాడు. విమర్శలతో ఎప్పుడూ వెనుకంజ వేయలేదు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో నిరంతరం ముందుకు సాగుతూనే ఉన్నాడు. అతడు తన లక్ష్యం నుంచి వెనుకంజ వేయలేదు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జిల్లా, రాష్ట్ర, జాతీయ క్రీడాకారుడిగా తన నైపుణ్యాన్ని పెంచుకుంటూనే ఉన్నాడు. తన పాల్గొన్న ప్రతి పోటీలోనూ బహుమతి పొందేలా తన సత్తా చాటుతూ దేశ గౌరవాన్ని పెంపొందిస్తూనే ఉన్నాడు. పారా వాలీబాల్ క్రీడలో రాష్ట్రం నుంచి మన దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారుడు ఇతడొక్కడే. ఆటలు ఆడటం, దేశ విదేశాల్లో జరిగే వివిధ క్రీడాపోటీలకు హాజరవ్వటం డబ్బుతో కూడుకున్న వ్యవహారం. అయినా పేదరిక సమస్యలున్నా తల్లిదండ్రులు అప్పోసొప్పో చేస్తూ గణేష్‌కు ప్రోత్సాహం ఇస్తుండటంతో అంతర్జాతీయ క్రీడాకారుడు స్థాయికి రాగలిగారు. 2016 నుంచి ఆంధ్రప్రదేశ్ పారా వాలీబాల్ అసోసియేషన్ ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇప్పటి వరకూ 8 జాతీయ, రెండు అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధించాడు.



సొంతంగానే శిక్షణ

గణేష్ వ్యక్తిగతంగానే శిక్షణ పొందుతున్నాడు. గ్రామంలోనూ, సమీపంలోనూ ఎలాంటి గ్రౌండ్ కూడా అందుబాటులో లేదు. సరైన కోచ్ కూడా ఎవ్వరూ లేరు. యూట్యూబ్‌లో వీడియోలు చూసుకుంటూ తనే సొంతంగా మెలకువలు నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నాడు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి సహాయం చేస్తే మంచిగా పారా ఒలింపిక్స్ క్రీడలో సత్తా చాటి మన దేశానికి పేరు ప్రఖ్యాతులు సాధిస్తాడనటంలో సందేహం లేదు. ఆ దిశగా శాప్, రాష్ట్రప్రభుత్వం స్పందించాల్సివుంది.

క్రికెట్‌లోనూ ప్రావీణ్యం

పారా వాలీబాల్ క్రీడతోపాటుగా క్రికెట్‌లోనూ గణేష్ మంచి ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తున్నాడు. పలు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని పలు బహుమతులు సైతం కైవసం చేసుకున్నాడు. క్రికెట్, రన్నింగ్‌లోనూ పలు పతకాలను సాధించాడు. ఆంధ్రా క్రికెట్ జట్టులో పాల్గొని మంచి ప్రతిభను ప్రదర్శించాడు. కబడ్డీ-18లో జాతీయస్థాయిలో రాష్ట్రం తరపున రన్నరప్‌గా జట్టు నిలిచింది. బెస్ట్ రిఫెండర్, బెస్ట్ ఎటాకర్, బెస్ట్ గేమ్‌ఛేంజర్‌గా ఆయనకు వ్యక్తిగత విభాగంలో బహుమతులు వచ్చాయి. పారా క్రికెట్‌లో బెస్ట్ బ్యాట్‌మెన్‌గానూ, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కూడా నిలిచాడు.

ప్రాతినిధ్యం వహించిన క్రీడలు

- 10వ జాతీయస్థాయి పారా వాలీబాల్ ఛాంపియన్‌షిప్-2022 (బెంగళూరు, కర్నాటక)
- 11వ జాతీయస్థాయి పారా వాలీబాల్ ఛాంపియన్‌షిప్ -2023 (తంజావూరు, తమిళనాడు)
- ఎపారా సిట్టింగ్ వాలీబాల్ ఫెడరేషన్ కప్-2023 (సిరువాచూర్, తమిళనాడు) -కజకిస్తాన్ టీం ఇండియా టీం ఎంపిక (అమరావతిలోని విట్ యూనివర్శిటీ)-2023
- 12వ జాతీయస్థాయి పారా వాలీబాల్ ఛాంపియన్‌షిప్ 2024 (జైపూర్, రాజస్థాన్)
- 13వ జాతీయస్థాయి పారా వాలీబాల్ ఛాంపియన్‌షిప్ -2025(ఈరోడ్, తమిళనాడు)
- వరల్డ్ కప్ టీమ్ బృందం ఎంపిక - 2025 (బెంగళూరు యూనివర్శిటీ, కర్నాటక)

పతకమే లక్ష్యం...

అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో 2028లో జరగనున్న పారా ఒలింపిక్స్‌లో పతకం సాధించటమే నా లక్ష్యం. కోచింగ్‌కు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత ఆర్థిక సహాయం చేస్తే మరింత మంచి సాధనకు ఉపయోగపడుతుంది. రాష్ట్రప్రభుత్వం నుంచి గ్రూప్-3 కేటగిరీలో నాకు ఉద్యోగం ఇస్తే కుటుంబానికి ఎంతో సహాయంగా ఉంటుంది.

- అన్నం గణేష్,
పారా వాలీబాల్ క్రీడాకారుడు



పేదరికం తాలూకా ఆనవాళ్లు...

పేద కుటుంబంలో జన్మించిన గణేష్‌కు దాని తాలూకా బాధలు బాగా తెలుసు. తల్లి ఆవులు మేపుతూ జీవనోపాధికి తోడ్పాటును అందిస్తున్నారు. అతడి తండ్రి సమీపంలో ఉన్న ఓ ప్రయివేటు కంపెనీలో రోజువారీ కార్మికుడు. గణేష్ వాలీబాల్ ఆటపై ఉన్న మక్కువతో నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఏదైనా ఉద్యోగంలో చేరితే ఆటపై ఆసక్తి తగ్గుతుందనే నిరంతరం వాలీబాల్‌కే ప్రాధాన్యం ఇస్తున్నాడు. ఇంటి ఆర్థిక పరిస్థితి మరీ ఇబ్బందికరం అయినప్పుడు చిన్న చిన్న పనుల్లో కుదరాల్సి వస్తోంది. కొన్ని రోజులపాటు స్థానిక డెయిరీలో పాలప్యాకెట్లు అమ్మే పనిలో కుదిరాడు. సినిమా క్లబ్‌లో అవసరమున్న రోజుల్లో బౌన్సర్‌గా కూడా వెళుతున్నాడు. పారా ఒలింపిక్స్‌లో పతకాన్ని సాధించటమే తన మొదటి లక్ష్యమని గణేష్ చెబుతున్నారు.

ప్రపంచస్థాయి పోటీల్లో ...

2024లో మే 28 నుంచి జూన్ 2 వరకు చైనాలో జరిగిన వరల్డ్ పారా బీచ్ వాలీ వరల్డ్ చాంఫియన్‌షిప్‌లో గణేష్ మన దేశం నుంచి తరపున ప్రాతినిధ్యం వహించి సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ ఏడాది అక్టోబర్ 12 నుంచి 18 వరకు అమెరికాలోని ఫోర్ట్‌వేన్‌లో జరిగిన వరల్డ్ కప్ పోటీల్లో పాల్గొన్నాడు. ఈ క్రీడలో మన దేశం నుంచి 14 మంది క్రీడాకారులు పాల్గొనగా, మన రాష్ట్రం నుంచి గణేష్ ఉన్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు



ప్రభాస్‌తో ప్రేమ్‌రక్షిత్ సినిమా

కథానాయకుడు ప్రభాస్ పలు కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన నటించిన 'రాజాసాబ్' సినిమా త్వరలో విడుదల కానుంది. ప్రస్తుతం 'ఫౌజీ' సినిమా షూటింగ్‌లో ఆయన ఉన్నాడు. మరోవైపు సలార్ 2, కల్కి 2 చిత్రాలు కూడా ప్రకటించిన జాబితాలో ఉన్నాయి. ఇవే కాకుండా ప్రశాంత్ వర్మతో కూడా ఓ సినిమా చేయబోతున్నట్లుగా సమాచారం. ప్రముఖ కొరియోగ్రాఫర్, 'నాటు నాటు' ఫేమ్ ప్రేమ్ రక్షిత్‌తో కూడా ఓ సినిమా చేయటానికి ప్రభాస్ ఒప్పుకున్నారు.



2027 వేసవిలో మహేశ్-రాజమౌళి మూవీ 'వారణాసి'..

సూపర్‌స్టార్ మహేశ్ బాబు, ప్రముఖ దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రానికి సంబంధించిన మరొక అప్‌డేట్ వచ్చింది. ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రానికి 'వారణాసి' అనే పేరును ఖరారు చేశారు. ఈ మేరకు, శనివారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన కార్యక్రమంలో ఈ టైటిల్‌ను పరిచయం చేశారు. ఈ సినిమాకు సంబంధించిన మహేశ్ బాబు ఫస్ట్ లుక్ విశేషంగా ఆకట్టుకుంది. నందిపై కూర్చుని, చేతిలో త్రిశూలంతో, మెడలో నంది లాకెట్ ధరించి ఆయన స్వారీ చేస్తున్నట్లుగా ఈ చిత్రం ఉంది. ఈ చిత్రంలో మహేశ్ బాబు రుద్ర అనే పాత్రలో కనిపించనున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి ప్రముఖ తారలు ఈ చిత్రంలో నటిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. 2027 వేసవిలో ఈ మూవీని విడుదల చేయనున్నారు.

'వందేమాతరం' సినిమాకు రెండు అవార్డులు

యువ దర్శకుడు బి.వి.రత్నం తన రత్నం మూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో తెరకెక్కిన 'వందేమాతరం' సినిమా రెండు అవార్డులను కైవసం చేసుకుంది. బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకూ రెయిన్‌బో చిల్డ్రన్స్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో పలు చిత్రాల ప్రదర్శనలు జరిగాయి. ఇందులో 'వందేమాతరం' సినిమా స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పట్టిచూపటంతో అవార్డుకు ఎంపికైంది. 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79వ సంవత్సరాలైనా నేటికీ గ్రామాల్లో ఫ్యూడల్, పెట్టుబడిదారీ పోకడలు పోలేదనీ, బ్రిటీష్ వారితో జమీందారీ వ్యవస్థ రద్దుచేసినా ఇంకా అక్కడక్కడా పెట్టుబడిదారీ ఛాయలు కన్పిస్తూనే ఉన్నాయనే అలాంటి సంఘటనలు పట్టిచూపిన చిత్రమిది. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన రాజా అనే కాలేజీ లెక్చరర్ చేసిన ఉద్యమమే ఈ వందేమాతరం. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, నిర్మాత, దర్శకత్వం బి.వి.రత్నం చాలా చక్కగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. బెస్ట్ ఫిలిం, బెస్ట్ యాక్టర్, బెస్ట్ డైరెక్షన్, బెస్ట్ ప్రొడ్యూసర్ అవార్డులకు ప్రతిపాదనలు పంపగా బెస్ట్ యాక్టర్‌గా శోభన్‌రాజా, బెస్ట్ డైరెక్టర్‌గా బి.వి.రత్నంను అవార్డులు వరించాయి. శుక్రవారంనాడు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను బి.వి.రత్నం,శోభన్‌రాజా సినీరంగ ప్రముఖుల చేతులమీదుగా అందుకున్నారు.



తమిళ దర్శకుడు వి.శేఖర్ కన్నుమూత



సీనియర్ తమిళ దర్శకుడు వి.శేఖర్ (73) అనారోగ్యం కారణంగా కన్నుమూశారు. కోడంబాక్కంలో నివసిస్తున్న ఆయన పది రోజులుగా అనారోగ్యం - కారణంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన మృతికి కోలీవుడ్‌కు చెందిన సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. 'సింగలుమ్ -హీరోదాన్' అనే చిత్రం ద్వారా 1990లో దర్శకుడిగా పరిచయమైన వి.శేఖర్ 'పొందాట్రి సొన్న -కేక్కనుమ్', 'విరలుక్కేత్త వీక్కం', 'వరవు ఎట్టణ సెలవు పత్తణ' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరించారు. పేద, మధ్యతరగతి ప్రజల జీవన విధానం, కుటుంబ సమస్యలు శేఖర్ సినిమాల్లో ప్రధాన ఇతివృత్తంగా ఉండేవి.

సంగీత్ శోభన్ కొత్త సినిమా

ధీరజ్ మొగిలినేని, గిరిబాబు వల్లభనేనితో కలిసి సంగీత్ శోభన్ హీరోగా ఓ సినిమాని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవంలో 'ది గర్ల్ ఫ్రెండ్' దర్శకుడు రాహుల్ రవీంద్రన్ అతిథిగా హాజరై చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందించారు. ఈ సినిమాను 'కరెంట్' మూవీ ఫేమ్ పల్నాటి సూర్యప్రతాప్ డైరెక్ట్ చేస్తున్నారు. సుకుమార్ శిష్యుడైన సూర్యప్రతాప్ 'కరెంట్' మూవీతో దర్శకుడయ్యారు. ఆ తర్వాత సుకుమార్ నిర్మాతగా 'కుమారి 21 ఎఫ్', నిఖిల్ హీరోగా '18 పేజీస్' చిత్రాలని తెరకెక్కించారు. తాజాగా ఇప్పుడు ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌లో నాలుగో సినిమాను చేస్తున్నారు. ఈ సినిమాకు విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. లక్ష్మీ భూపాల్ రచయిత.



స్పిన్‌కు విలవిల



- రవీంద్ర జడేజా, కుల్‌దీప్ మాయాజాలం
- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 93/7

భారత్ తొలి ఇన్నింగ్స్ 189/10

పరుగుల పిచ్ అంటూ ఊరించిన ఈడెన్‌గార్డెన్స్.. బ్యాటర్లకు చుక్కలు చూపిస్తోంది. తొలి రోజు పేసర్లు విజృంభించగా.. రెండో రోజు స్పిన్ మాయ మొదలైంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 189 పరుగులకు ఆలౌట్ కాగా.. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 93 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. స్వల్ప స్కోర్ల టెస్టు మూడు రోజుల్లోనే ముగిసే అవకాశం ఉంది.

కోల్‌కతా: లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా (4/29), చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ (2/12) మాయాజాలం సృష్టించారు. మరో స్పిన్నర్ అక్షర్ పటేల్ (1/30) సైతం మాయలో జతకలవటంతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 93/7తో కష్టాల్లో పడింది. కెప్టెన్ తెంబ బవుమా (29 నాటౌట్, 78 బంతుల్లో 3 ఫోర్లు), కార్బిన్ బాచ్ (1 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 189 పరుగులే చేసింది. ఓపెనర్ కెఎల్ రాహుల్ (39, 119 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), రిషబ్ పంత్ (27, 24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (27, 45 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకే ఆలౌట్ కాగా.. భారత్ 30 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది.

సఫారీ విలవిల : స్పిన్ త్రయం జడేజా, కుల్‌దీప్, అక్షర్ మాయ ముందు దక్షిణాఫ్రికా బ్యాటర్లు విలవిల్లాడారు. ఓపెనర్ రికెల్టన్ (11) వికెట్‌తో కుల్‌దీప్ వికెట్ల జాతరకు తెరతీయగా.. జడేజా సఫారీ పతనం వేగవంతం చేశ్వాడు. మార్క్రామ్ (4)ను అవుట్ చేసిన జడేజా.. వియాన్ ముల్డర్ (11), టోనీ (2)లను ఒకే ఓవర్లో సాగనంపాడు. ట్రిస్టన్ స్టబ్స్ (5) సైతం జడేజా మాయలో పడ్డాడు. మార్కో జాన్సెన్ (13)ను కుల్‌దీప్.. కైల్ వెరెనె (9) అక్షర్ అవుట్ చేయటంతో దక్షిణాఫ్రికా 91 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్ లోటు అనంతరం సఫారీ ప్రస్తుతం 63 పరుగుల ముందంజలో నిలిచింది. కెప్టెన్ తెంబ బవుమా (29 నాటౌట్) ఓ ఎండ్‌లో సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. నేడు ఉదయం సెషన్లో ఆ జట్టు 50-60 పరుగులు జోడించటంపై కన్నేసింది.

మనోళ్లూ పడ్డారు

ఈడెన్‌గార్డెన్స్ పిచ్‌పై భారత బ్యాటర్లు సైతం తడబాటుకు గురయ్యారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (4) మెడ నొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా నిష్క్రమించి, మళ్లీ బ్యాటింగ్‌కు రాలేదు. ఓపెనర్ కెఎల్ రాహుల్ (39) నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరువగా.. వాషింగ్టన్ సుందర్ (29) నం.3 బ్యాటర్‌గా ఆకట్టుకున్నాడు. రిషబ్ పంత్ (27) రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో ధనాధన్ దూకుడు చూపించగా.. రవీంద్ర జడేజా (27) రాణించాడు. ధ్రువ్ జురెల్ (14), అక్షర్ పటేల్ (16) ఫర్వాలేదనిపించారు. టెయిలెండర్లు కుల్‌దీప్ (1), సిరాజ్ (1), బుమ్రా (1 నాటౌట్) పరుగుల వేటలో మెప్పించలేదు. 62.2 ఓవర్లలో భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల విలువైన ఆధిక్యం దక్కించుకుంది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 159/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (బి) జాన్సెన్ 12, కెఎల్ రాహుల్ (సి) మార్క్రామ్ (బి) మహరాజ్ 39, వాషింగ్టన్ సుందర్ (సి) మార్క్రామ్ (బి) హార్మర్ 29, శుభ్‌మన్ గిల్ (రిటైర్డ్ హర్ట్) 4, రిషబ్ పంత్ (సి) వెరెనె (బి) బాచ్ 27, రవీంద్ర జడేజా (ఎల్బీ) హార్మర్ 27, ధ్రువ్ జురెల్ (సి,బి) హార్మర్ 4, అక్షర్ పటేల్ (సి) జాన్సెన్ (బి) హార్మర్ 16, కుల్‌దీప్ యాదవ్ (సి) వెరెనె (బి) జాన్సెన్ 1, సిరాజ్ (బి) జాన్సెన్ 1, బుమ్రా నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 18, **మొత్తం : (62.2 ఓవర్లలో ఆలౌట్) 189.**

వికెట్ల పతనం : 1-18, 2-75, 2-79 (గిల్), 3-109, 4-132, 5-153, 6-171, 7-172, 8-187, 9-189.

బౌలింగ్ : మార్కో జాన్సెన్ 15-4-35-3, వియాన్ ముల్డర్ 5-1-15-0, కేశవ్ మహరాజ్ 16-1-66-1, కార్బిన్ బాచ్ 11-4-32-1, సైమన్ హార్మర్ 15.2-4-30-4.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : రియాన్ రికెల్టన్ (ఎల్బీ) కుల్‌దీప్ 11, ఎడెన్ మార్క్రామ్ (సి) జురెల్ (బి) జడేజా 4, వియాన్ ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 1, తెంబ బవుమా నాటౌట్ 29, టోనీ (సి) జురెల్ (బి) జడేజా 2, ట్రిస్టన్ స్టబ్స్ (బి) జడేజా 5, వెరెనె (బి) అక్షర్ 5, మార్కో జాన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప 13, కార్బిన్ బాచ్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం : (35 ఓవర్లలో 7 వికెట్లకు) 93.**

వికెట్ల పతనం : 1-19, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 6-1-14-0, అక్షర్ పటేల్ 11-0-30-1, కుల్‌దీప్ యాదవ్ 5-1-12-2, రవీంద్ర జడేజా 13-3-29-4.

ఐపిఎల్-2026 రిటెన్షన్ లిస్ట్ విడుదల

న్యూఢిల్లీ : క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపిఎల్ 2026 రిటెన్షన్ లిస్ట్ వచ్చేసింది. డిసెంబరు 15న అబుదాబిలో మినీ వేలం జరగనుంది. ఈ నేపథ్యంలో రిటైన్, రిలీజ్ చేసే ఆటగాళ్ల వివరాలను ఫ్రాంఛైజీలు ప్రకటించాయి.

రిలీజ్ చేసింది వీరినే..

సిఎస్‌కె : మతీశా పతిరన, రాహుల్ త్రిపాఠి, వన్ష్ బేడి, ఆంద్రీ సిద్ధార్థ్, రచిన్ రవీంద్ర, దీపక్ హుడా, విజయ్ శంకర్, షేక్ రషీద్, కమలేశ్ నగార్‌కోటి.

ముంబయి : సత్యనారాయణ రాజు, రీస్ టాప్లీ, కెఎల్ శ్రీజిత్, కర్ణ్ శర్మ, బెవాన్ జాకబ్స్, ముజీబుర్ రెహ్మాన్, లిజాడ్ విలియమ్స్, విఘ్నేశ్ పుతుర్.

పంజాబ్: జోష్ ఇంగ్లిస్, ఆరోన్ హర్డీ, కుల్‌దీప్ సేన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, ప్రవీణ్ దూబె.

ఆర్‌సిబి : స్వస్తిక్ చికారా, మయాంక్ అగర్వాల్, టిమ్ సిఫర్ట్, లియామ్ లివింగ్‌స్టన్, మనోజ్ భాండ్గే, లుంగి ఎంగిడి, ముజారబానీ, మోహిత్ రాథీ.

సన్‌రైజర్స్ హైదరాబాద్ : అభినవ్ మనోహర్, అథర్వ తైడే, సచిన్ బేబీ, వియాన్ ముల్డర్, సిమర్‌జిత్ సింగ్, రాహుల్ చాహర్, ఆడమ్ జంపా.

ఢిల్లీ : డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్, సెధిఖుల్లా అటల్, మన్వంత్ కుమార్, దర్శన్ నల్కండే, మోహిత్ శర్మ.

గుజరాత్ టైటాన్స్ : మహిపాల్ లామ్రోర్, కరీమ్ జనత్, డాసున్ శనక, గెరాల్డ్ కొయెట్జీ, కుల్వంత్ కుజ్రోలియా

లక్నో : ఆర్యన్ జుయల్, డేవిడ్ మిల్లర్, యువరాజ్ చౌదరి, రాజ్యవర్ధన్ హంగర్గేకర్, ఆకాశ్ దీప్, రవి బిష్ణోయ్, షమర్ జోసెఫ్.

రాజస్థాన్ : వానిందు హసరంగ, మహీశ్ తీక్షణ, ఫజల్ హక్ ఫారూఖీ, ఆకాశ్ మధ్వాల్, కుమార్ కార్తికేయ, కునాల్ రాథోడ్, అశోక్ శర్మ.

కోల్‌కతా : ఆంద్రీ రస్సెల్, వెంకటేశ్ అయ్యర్, క్వింటన్ డికాక్, ఆన్రిచ్ నోకియా, మొయిన్ అలీ, స్పెన్సన్ జాన్సన్, లువినిత్ సిసోడియా, చేతన్ సకారియా, రహ్మానుల్లా గుర్బాజ్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68